మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 8-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 279 Issue: 279

08 ఏప్రిల్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:27 తిథి షష్ఠి రా. 7:01 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం మూల ఉ. 8:42o వరకు యోగం వారియ సా. 5:03 వరకు కరణం వనిజ రా. 7:01 వరకు విష్టి ఉ. 8:14o వరకు వర్జ్యం మ. 2:51 నుండి సా. 4:39 వరకు దుర్ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:42 వరకు రాహుకాలం మ. 12:18 నుండి మ. 1:50 వరకు యమగండం ఉ. 7:41 నుండి ఉ. 9:13 వరకు గుళికాకాలం ఉ. 10:45 నుండి మ. 12:18 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు రా. 1:42 నుండి తె. 3:30 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana

# దగడు బెగడు




## పొంచి ఉన్న వడగాడ్పులు

**ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే చాన్స్.. పలు జిల్లాల్లో రికార్డు స్థాయికి!**

**వ్యవసాయానికి పెను సవాలు.. కీలక దశలో యాసంగి పంటలు**

**వడగాడ్పులు వీస్తే దిగుబడికి ధోకా.. అడుగంటుతున్న జలాశయాలు**

తెలంగాణలో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఓ వైపు అకాల వర్షాలు, వడగండ్ల వానలతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రైతన్నపై భగభగ మండే ఎండలు విరుచుకుపడబోతున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం, ఏప్రిల్ 9 నుండి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41లీజ నుండి 44లీజ వరకు నమోదయ్యే ప్రమాదం ఉంది. ఈ తీవ్రమైన వడగాలులు కేవలం ప్రజల ఆరోగ్యానికే కాదు, వ్యవసాయ రంగానికి కూడా పెను సవాలుగా మారనున్నాయి.

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి (రబీ) పంటలు కీలక దశలో ఉన్నాయి. వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు (మినుము, పెసర) కూరగాయల పంటలు పూత, పిందె దశలో లేదా గింజ గట్టిపడే దశలో ఉన్నాయి. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పెరిగితే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. గింజ గట్టిపడే దశలో అధిక ఉష్ణోగ్రతల వల్ల గింజలు తాలుగా మారే ప్రమాదం ఉంది. దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఈ మధ్య కురిసిన రాళ్ల వానకు మామిడి వంటి తోటల్లో కాయలు రాలిపోవడం, కాయ నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కూరగాయల సాగులో, ముఖ్యంగా టమాటా, మిరప వంటి పంటలలో పూత రాలిపోవడం తరువాయి 2 వ పేజీలో...



## డెడ్ స్టోరేజీకి రిజర్వాయర్లు

రాష్ట్రంలోని జాలాశయాలు డెడ్ స్టోరేజ్‌గా మారుతున్నాయి. యాసంగి సీజన్ చివరి దశలో ఉన్నందున రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సకాలంలో పడకపోతే తాగు, సాగు నీటికి తీవ్ర కొరత ఏర్పడుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నీరు తరలించుకుపోతున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలం, ఏప్రిల్ 7 (ఈవార్తలు): శ్రీశైలం ప్రాజెక్టులో 215.81 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం కేవలం 43.75 టీఎంసీలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 312.05 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 176.06 టీఎంసీలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 80.50 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 28.85 టీఎంసీలు, నిజాంసాగర్లో 17.80 టీఎంసీల సామర్థ్యానికి 9.54 టీఎంసీలు, సింగూర్లో తరువాయి 2 వ పేజీలో...



**శబరిమలలో మహిళలకు 'నో' ఎంట్రీ సరైనదే: కేంద్రం**



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,984 |
| వెండి (గ్రాము): | రూ.255 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,859 |

### విశ్వవాణి



15 ఏళ్లకే పీహెచ్‌డీ చేసి అద్భుతం చేశాడో టీనేజీ కుర్రాడు. పైగా, ఆ పీహెచ్‌డీ చేసింది క్వాంటం ఫిజిక్స్‌లో. లారెంట్ సైమన్స్ అనే కుర్రాడు.. బెల్జియంలోని ఆంట్వెర్ప్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. ఇతగాడి ఐక్యూ 145గా ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# సవాల్.. సై!

## తెలంగాణ సీఎం వర్సెస్ కేరళం సీఎం

**వ్యక్తిగత విమర్శలు మానుకో: విజయన్.. అభ్యంతరకర భాష వద్దు: రేవంత్ రెడ్డి**





కేరళ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సోషల్ మీడియా వేదికగా రగులుకున్న వివాదం ఇప్పుడు మరింత ముదిరింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన విమర్శలకు బదులుగా, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఒక సుదీర్ఘమైన, ఘాటైన బహిరంగ లేఖను విడుదల చేశారు.

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలు, విమర్శలు సహజమేనని అంగీకరించిన విజయన్.. వాటిని హుందాగా ఉంచాలి తప్ప వ్యక్తిగత దూషణల స్థాయికి దిగజార్చడం ఏమాత్రం సరైన పద్ధతి కాదని తన లేఖలో స్పష్టం చేశారు. నాయకుల మధ్య జరిగే రాజకీయ చర్చలు ఎప్పుడూ పరస్పర గౌరవంతో సాగాలని సూచిస్తూ రేవంత్ రెడ్డికి గట్టిగానే హితవు పలికారు. అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ, విజయన్ నీతి ఆయోగ్ విడుదల చేసిన సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఇండెక్స్ 2023-24 గణాంకాలను ప్రధాన అస్త్రంగా వాడుకున్నారు. ఈ తాజా నివేదిక ప్రకారం, 79 పాయింట్లతో కేరళ దేశంలోనే మొదటి స్థానంలో దర్జాగా నిలబడితే, తెలంగాణ మాత్రం ఆరవ స్థానానికి పరిమితమైందని ఆయన ఎత్తి చూపారు. కేరళ ఈ అగ్రస్థానానికి చేరుకోవడం రాత్రికి రాత్రే జరగలేదని, దశాబ్దాలుగా వామపక్ష ప్రభుత్వాలు చేసిన కఠోర తరువాయి 2 వ పేజీలో...



# కుళ్లిన బిర్యానీ.. వేడివేడిగా వడ్డిస్తారు!

**మూడ్రోజుల క్రితం వండిన బిర్యానీ**

**ఫ్రిజ్‌లో నిల్వ.. ఓవెన్‌లో వేడిచేసి అమ్మకాలు**

**జీడిమెట్లలో బయటపడ్డ వందల ప్యాకెట్లు**


హైదరాబాద్ అంటే బిర్యానీ.. బిర్యానీ అంటే హైదరా బాద్. వారానికి ఒక్కసారైనా టేస్ట్ చేయకపోతే మనసొప్పదు. వీలైతే ఆర్డర్ చేసుకొని లాగించే యాలన్నంత ఇష్టం. అయితే, ఆన్‌లైన్ ఆర్డర్ చేసుకొనేముందు వెనకాముందు చూసుకోవాల్సిందే. ఎందుకంటే.. 3 రోజుల క్రితం వండిన బిర్యానీని డెలివరీ చేస్తున్న ఓ హోటల్ యజమాని గుట్టును బంజరాహిల్స్ పోలీసులు రట్టు చేశారు. బంజారా హిల్స్ లోని రోడ్ నెం-2లో నివసిస్తున్న కొండారెడ్డి అనే వ్యక్తికి తొలుత ఈ చేదు అనుభవం ఎదురైంది.

జీడిమెట్ల, ఏప్రిల్ 7 (ఈవార్తలు): స్థానికంగా ఉన్న లక్కీ షవర్మా రెస్టారెంట్ నుంచి చికెన్ బిర్యానీని ఆర్డర్ చేశారు. ఈ క్రమంలో జొమాటో డెలివరీ బాయ్ దానిని తీసుకొచ్చి ఇచ్చారు. దీంతో కొండారెడ్డి ప్యాకెట్ ఓపెన్ చేయగా.. ఘుమఘుమలకు బదులుగా దుర్వాసన వచ్చింది. లోపల బిర్యానీ పాచిపోయి ఉండటం చూసి అతడు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. పాచిపోయిన బిర్యానీని సరఫరా చేసిన లక్కీ షవర్మా రెస్టారెంట్ పై జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ లో కొండారెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా విస్తుపోయే తరువాయి 2 వ పేజీలో...

# అంతం.. పంతం


## ఇరాన్‌ను అంతం చేస్తా: ట్రంప్

**ప్రాణాలను లెక్క చేయం: ఇరాన్ పంతం**



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం మంగళవారంరాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని, ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

టెహ్రాన్/వాషింగ్టన్: ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని, కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో తరువాయి 2 వ పేజీలో...



## ఎక్కడికక్కడే ఉండిపోండి

**ఇరాన్‌లోని భారతీయులకు ఎంబసీ అలర్ట్**

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయ పౌరులకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం మంగళవారం అత్యవసర అడ్వైజరీని జారీ చేసింది. రానున్న 48 గంటల పాటు భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ బయటకు రావొద్దని, ఉన్న చోటే సురక్షితంగా ఉండాలని స్పష్టం చేసింది. ఇరాన్‌లో ఉన్న తరువాయి 2 వ పేజీలో...




## పాకిస్థాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్'

**రాత్రి 8 గంటలకే మార్కెట్లు క్లోజ్.. 10 గంటల్లోగా రెస్టారెంట్లు బంద్**

ఇస్లామాబాద్: ఇరాన్ యుద్ధం పాకిస్థాన్‌పై పెను ప్రభావం చూపుతోంది. హార్ముజ్ జలసంధి మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాకిస్థాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. చమురు కొరత ప్రభావంతో ఇప్పటికే దేశంలో పలు ఆంక్షలు విధించిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధిస్తూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. చమురు కొరతపై రాష్ట్రాల సీఎంలతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. చమురు వినియోగాన్ని తగ్గించేందుకు, ఉన్న నిల్వల్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ ప్రధాని తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

8.4.2026

మేషం: సమాజంలో విశేషంగా పలుకుబడి పెరుగుతుంది. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. పాత మిత్రుల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు పొందుతారు . ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్థిరాస్తి వివాదాలకు సంబంధించి ఆప్తుల నుండి కీలక సమాచారం అందుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఉత్తమ ఫలితాలు పొందుతారు. విద్యార్థుల ఫలితాలు సంతృప్తి కలిగిస్తాయి.

మిధునం: కుటుంబ విషయంలో స్థిరమైన ఆలోచనలు చెయ్యలేరు. సన్నిహితులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి ఒత్తిడి తప్పదు.

కర్కాటకం: దీర్ఘకాలిక ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత మందగిస్తుంది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో కలహా సూచనలున్నవి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: గృహమున వివాహ శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా మరింత మెరుగైన వాతావరణం ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పనిచేసి లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు ఆశించిన స్థాన చలనాల కలుగుతాయి.

కన్య: ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. సన్నిహితులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రాహారాలు ఉండవు. చేపట్టిన పనులు శ్రమతో కాని పూర్తికావు. ముఖ్యమైన వ్యవహారాలలో నమ్మినవారే మోసగిస్తారు. వ్యాపారమున అలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

తుల: సోదరులతో దీర్ఘకాలిక వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగ విషయంలో జాప్యం కలిగిన అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. విద్యార్థులు మరింత కష్టపడాలి.

వృశ్చికం: దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. జీవితభాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలిస్తాయి. స్థిరాస్తి కొనుగోలుకు ఆటంకాలు తొలగుతాయి.

ధనస్సు: వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుతాయి. సమాజంలో విశేషమైన గౌరవమర్యాదలు పెరుగుతాయి. ఉద్యోగస్తులు అధికారుల అనుగ్రహంతో నూతన అవకాశాలు అందుకుంటారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: బంధు మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు మరింత కలవరపెడతాయి. చేపట్టిన పనులలో నిదానంగా ముందుకు సాగడం మంచిది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు వలన విశ్రాంతి ఉండదు. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభం: ఆర్థికంగా కొంత ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవసరానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడంలో ఇబ్బందులు తప్పవు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

మీనం: ఆర్థిక లావాదేవీలు కొంత నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పూర్తికావు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. ఇంటా బయట వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో భాగస్వాములతో వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు వాయిదా వేస్తారు.

# దగడు బెగడు



మొదటి పేజీ తరువాయి

రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎండల తీవ్రత పెరిగేకొద్దీ భూమిలోని తేమ వేగంగా ఆవిరైపోతుంది. దీంతో పంటలకు తరచూ తడి అందించాల్సి వస్తుంది. కానీ, భూగర్భ జలాలు అడుగంటుతుండటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. గత 25 ఏండ్లలో చూసుకుంటే ఈ ఏడాది ఫిబ్రవరిలోనే అతి తక్కువ వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ పేర్కొంది. ఈసారి చలి తీవ్రత త్వరగా తగ్గిపోవడం వేసవి తీవ్రతకు సంకేతంగా కనిపిస్తున్నదని పేర్కొంది. ఫసిఫిక్ మహాసముద్రంలో 'లానినా' పరిస్థితులు బలహీనపడి 'ఎల్‌నినో' పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో ఎండల తీవ్రత మరింత పెరిగే చాన్స్ ఉందని పేర్కొంది.

### కాళేశ్వరంపై కరుణ చూపాల్సిందే

జోరు ఎండలకు తోడు వచ్చే వర్షకాలం వానలు తక్కువగా కురుస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో కాళేశ్వరమే వరప్రదాయిని కానుంది. ప్రస్తుతం వేసవి కాలం ముమ్మరంగా సాగుతోంది. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రతతో పాటు నీటి అవసరాలు కూడా గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. ఈ తరుణంలో కాళేశ్వరం ప్రాజెక్టును సరిగ్గా సద్వినియోగం చేసుకోలేకపోతే, రాష్ట్రం తీవ్రమైన నీటి గండాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గత కొంతకాలంగా కాళేశ్వరం చుట్టూ రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు హద్దులు దాటుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ.. దెబ్బతిన్న బరాజ్‌లను యుద్ధప్రాతిపదికన సరిచేయాల్సిన అవసరం ఉంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ప్రకారం, బరాజ్‌ల పునరుద్ధరణకు తక్షణ చర్యలు అవసరం. కానీ, ఈ ప్రక్రియలో జరుగుతున్న జాప్యం రాబోయే ఖరీఫ్, రబీ సీజన్లపై తీవ్ర ప్రభావం చూపనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం గోదావరి నీటిని ఎత్తిపోసి, చెరువులను, రిజర్వాయర్లను నింపడం. మేడిగడ్డ బరాజ్ నుండి నీటిని ఎత్తిపోయలేకపోతే, ఎగువన ఉన్న ప్రాజెక్టులకు నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోతుంది. ఇది కేవలం సాగునీటి సమస్య మాత్రమే కాదు. మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు, హైదరాబాద్ మహానగరానికి అందుతున్న తాగునీటి సరఫరాపైనా ఇది ప్రభావం చూపుతుంది. బరాజ్‌లలో నీటిని నిల్వ చేయలేకపోతే, భూగర్భ జలాలు అడుగంటిపోయి, బోర్ బావులు ఎండిపోయే ప్రమాదం ఉంది.

### ప్రభుత్వం నిద్ర లేవాలి

వేసవిలో పంటలు ఎండిపోకుండా కాపాడాలంటే ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. దెబ్బతిన్న బరాజ్‌ల మరమ్మతులను వేగవంతం చేయడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా నిర్వహించుకోవాలి. నిపుణుల కమిటీ సూచనల మేరకు మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ల మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలి. ఉన్న కొద్దిపాటి నీటిని వృథా కాకుండా, ఆన్-అండ్-ఆఫ్ పద్ధతిలో పంటలకు అందించాలి. ఇది ప్రజల జీవన్మరణ సమస్య. పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా ప్రాజెక్టును కాపాడుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం ఒక కట్టడం కాదు, అది తెలంగాణ రైతాంగం ఆశల సౌధం. ఆ సౌధం బీటలు వారితే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఇకనైనా మేల్కొని, కాళేశ్వరాన్ని రాజకీయ అంశంగా కాకుండా, రాష్ట్ర జీవనాడిగా పరిగణించి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే, ఈ ఎండాకాలం దాహం కేకలే మిగులుతాయి.

### రైతులూ జాగ్రత్త

రాబోయే విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి రైతులు, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగాలి. రైతులు పంటలకు తేలికపాటి తడులను తరచూ అందించాలి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో నీరు పెట్టడం వల్ల తేమ ఎక్కువ సేపు నిలిచి ఉంటుంది. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పద్ధతులను వినియోగించుకోవాలి. పొలాల్లో తేమ ఆవిరి కాకుండా మల్చింగ్ (ఎండు గడ్డి లేదా ప్లాస్టిక్ కవర్లు కప్పడం) పద్ధతిని పాటించాలి. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలు మన చేతుల్లో లేకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించుకునేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం ముఖ్యం. ఈ క్లిష్ట సమయంలో అన్నదాతకు అండగా నిలవడం సర్కారు బాధ్యత.

## డెడ్ స్టోరేజీకి రిజర్వాయర్లు

మొదటి పేజీ తరువాయి

29.91 టీఎంసీల సామర్థ్యానికి 7.46 టీఎంసీలు, జూరాల ప్రాజెక్టులో 9.66 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 4.71 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండడం ఆందోళన కలిగించే విషయమని నిపుణులు చెబుతున్నారు. ఇదే తరహాలో కొనసాగితే రాష్ట్రంలో సాగు, తాగు నీటికి తీవ్ర సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## పాకిస్థాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్'

మొదటి పేజీ తరువాయి

చెప్పాడు. 'స్మార్ట్ లాక్‌డౌన్' పై స్థానిక రేడియో వెల్లడించిన వివరాల ప్రకారం.. పాక్‌లోని పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బలూచిస్తాన్, ఇస్లామాబాద్, గిగ్లిత్ బల్తిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో పలు ఆంక్షలు విధించారు. మార్కెట్లు, షాపులు, ఇతర కమర్షియల్ స్పేసెస్ అన్నీ రాత్రి ఎనిమిది గంటలకు మూసేయాలి. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మినహాయింపులు ఇచ్చారు. అక్కడ రాత్రి 9 గంటల వరకు అనుమతి ఉంటుంది. జనరల్ స్టోర్స్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్ వంటివి ఎనిమిది గంటలకే మూసేయాలి. అలాగే, బేకరీలు, రెస్టారెంట్లు, ఇతర ఫుడ్ ఔట్‌లెట్లు మాత్రం రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచొచ్చు. అలాగే, పెళ్లి వేడుకలపై కూడా ఆంక్షలు విధించారు. రాత్రి 10 గంటల తర్వాత ఇళ్లల్లో మాత్రమే పెళ్లి వేడుకలు తక్కువ మందితో నిర్వహించుకోవాలి. మెడికల్ స్టోర్స్, ఫార్మసీలు మాత్రం ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయి. ఈ ఆంక్షలన్నీ మంగళవారం నుంచే అమలు చేయబోతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కొన్ని చోట్ల ప్రైవేటు వాహనాలపై నిషేధం విధించారు. అలాగే, ప్రభుత్వ రవాణా ఉచితంగా అందిస్తున్నారు. నెల రోజులపాటు గిల్గిత్, ముజఫరాబాద్ వంటి చోట్ల ఉచిత ప్రయాణం చేయవచ్చు. హార్ముజ్ జలసంధి తెరిచి, చమురు అందుబాటులోకి వచ్చే వరకు ఈ పరిస్థితి ఉంటుందని పాక్ అధికార వర్గాలు తెలిపాయి.

## కుళ్లిన బిర్యానీ..వేడివేడిగా వడ్డిస్తారు!

మొదటి పేజీ తరువాయి

వాస్తవాలు వెలుగుచూశాయి. ఫ్రిడ్జ్ లో ఉన్న 80 బిర్యానీ ప్యాకెట్లు చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు. జీడిమెట్లలో తయారు చేసిన బిర్యానీని ఇక్కడికి తీసుకొచ్చి ఫ్రిడ్జ్ లో భద్రపరుస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆర్డర్ వచ్చిన వెంటనే బిర్యానీని ఓవెన్‌లో వేడి చేసి సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. పైగా అవన్నీ 3 రోజుల క్రితం తయారైనట్లు కూడా పోలీసులు గుర్తించారు. హోటల్ యజమాని ఇర్ఫాన్.. ఈ పాచిపోయిన బిర్యానీని అమ్ముతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వాస్తవానికి బంజారాహిల్స్‌లో అతడికి ఎలాంటి రెస్టారెంట్ లేదని.. ఓ అపార్ట్ మెంట్ సెల్లార్‌లో లక్కీ బిర్యానీ అండ్ షవర్మా పేరిట మోసం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జీడిమెట్లలో తనకు ఉన్న మరో రెస్టారెంట్‌లో బిర్యానీ తయారు చేసి.. ఇక్కడి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు తేలింది. హోటల్ మట్నత్తం ఎలుకలు, బొద్దింకలతో అపరిశుభ్రంగా ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అతడ్ని అరెస్టు చేసి, హోటల్‌ను సీజ్ చేశారు.

## ఎక్కడికక్కడే ఉండిపోండి

మొదటి పేజీ తరువాయి

భారతీయులు రానున్న 48 గంటల పాటు ఇళ్లకే పరిమితం కావాలి. విద్యుత్ కేంద్రాలు, సైనిక స్థావరాలకు అత్యంత దూరంగా ఉండాలి. బహుళ అంతస్తుల భవనాల్లో (అపార్ట్‌మెంట్లు) పై అంతస్తుల్లో ఉండొద్దని, కింది ఫ్లోర్లలోనే సురక్షితంగా ఉండాలని ఎంబసీ సూచించింది. జాతీయ రహదారులపై (హైవేలు) ప్రయాణాలను పూర్తిగా నివారించాలి. ఒకవేళ ప్రయాణించక తప్పని పరిస్థితులు ఉంటే, తప్పనిసరిగా ఎంబసీ అధికారులతో ముందుగా సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేసింది. ఎంబసీ ద్వారా ఏర్పాటు చేసిన హోటళ్లలో బస చేస్తున్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావొద్దని, అక్కడి ఎంబసీ బృందాలతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. అధికారిక సమాచారం, తాజా అప్‌డేట్స్ కోసం ఎంబసీ ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించింది. భారతీయుల భద్రత దృష్ట్యా ఎంబసీ అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఏదైనా అత్యవసర సాయం కోసం కింది నంబర్లను సంప్రదించవచ్చని వెల్లడించారు.

# సవాల్.. సై!

మొదటి పేజీ తరువాయి

శ్రమ మరియు ప్రణాళికల వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. ఈ అద్భుత ప్రగతిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏ కోశానా లేదని కుండబద్దలు కొడుతూ, అభివృద్ధి పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఆయన వివరించారు. కేవలం అభివృద్ధి మాత్రమే కాదు, అవినీతి నిర్మూలనలోనూ తమ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని విజయన్ గర్వంగా చెప్పుకొచ్చారు. అదే నీతి ఆయోగ్ గణాంకాలను ఉదహరిస్తూ, భారతదేశంలో అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రంగా కేరళ రికార్డు సృష్టించిందని తెలిపారు. దానికి భిన్నంగా, దేశంలో అత్యధిక అవినీతి జరుగుతున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఆరవ స్థానంలో ఉందంటూ రేవంత్ రెడ్డి సర్కార్ పనితీరుపై ఆయన పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. పేదరిక నిర్మూలన విషయంలో కేరళ ప్రభుత్వం చేస్తున్న అద్భుతమైన కృషిని కూడా ఈ లేఖలో సవివరంగా ప్రస్తావించారు. వచ్చే ఏడాది నవంబర్ 1 (2025) నాటికి రాష్ట్రంలో 'అత్యంత దారిద్ర్యాన్ని' పూర్తిగా పారద్రోలి, ఆ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా కేరళ చరిత్ర సృష్టించబోతోందని ప్రకటించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 64,006 అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, వారి కోసం ప్రత్యేకంగా మైక్రో-ప్లాన్లను రూపొందించామని వివరించారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు తగిన ఆర్థిక దన్ను అందిస్తూ, పేదరిక నిర్మూలనలో గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

### దీటుగా రేవంత్ స్పందన

కేరళం రాష్ట్రం ఇప్పటివరకు సాధించిన విజయాలన్నీ గతంలోని యూడీఎఫ్ ప్రభుత్వాల పనితీరు ఫలితమేననే విషయాన్నిగుర్తించాలని కేరళం ముఖ్యమంత్రి పినరాయి విజయన్ కు రాసిన లేఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్డీఎఫ్ వరుసగా రెండు సార్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వాల హయాంలో ఏం జరిగిందో కేరళం ప్రజలకు తెలియజేయాలని సీఎం డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదని కేరళం ముఖ్యమంత్రి విజయన్ రాసిన లేఖకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రత్యుత్తరం రాశారు. కేరళం ప్రభుత్వ పనితీరుపై తాను గౌరవంగా, హుందాగా స్పందించాలని అనుకున్నానని, కానీ, మీ ప్రతిస్పందనలో మాత్రం మీరు అభ్యంతరకరమైన భాషను ఉపయోగించారని విజయన్ ను ఉద్దేశించి సీఎం పేర్కొన్నారు. ప్రత్యర్థుల తొందరపాటు వ్యాఖ్యలపై తానెప్పుడూ ఆవేశపూరితంగా స్పందించనని సీఎం తెలియజేశారు. మీరు తెలంగాణ రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి ఇవ్వాల్సిన గౌరవ, మర్యాదను ఇస్తానని విజయన్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా తెలియజేశారు. నీతి ఆయోగ్ ఎస్డీజీ సూచిక 2023-24ను పదే పదే తెలంగాణ రాష్ట్రానికి తప్పుడు విధంగా విజయన్ ఉదాహరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ సమయంలో తెలంగాణలో అధికారంలో ఉన్నది ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కాదని, అది పదేళ్ల బీఆర్ఎస్-బీజేపీ పదేళ్ల దుష్పరిపాలన చివరి దశ అని విజయన్‌కు సీఎం తెలియజేశారు. తెలంగాణలో తమ ప్రజా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకున్నందున ఈ కాలంలో తమ పనితీరు ఆధారంగా తమని అంచనా వేయాలని కేరళం ముఖ్యమంత్రి విజయన్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. 2024-25లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా నమోదైందని, ఇది 10.7 శాతం వృద్ధి రేటుతో జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరుకుందని, ఈ గణాంకాల ఆధారంగా తెలంగాణ భారతదేశంలోనే ముందు స్థానంలో నిలిచిందని సీఎం స్పష్టం చేశారు. ఆర్‌బీఐ హ్యాండ్‌బుక్ 2024-25 గణాంకాల ప్రకారం కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళం రాష్ట్రాలను తెలంగాణ అధిగమించిదన్నారు.

# అంతం.. పంతం

మొదటి పేజీ తరువాయి

వంతెనలు, విద్యుత్కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి.

### ప్రాణత్యాగానికైనా సిద్ధం: ఇరాన్

ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ప్రాణాలను త్యాగం చేయడానికి తనతో సహా ఇరాన్ పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానన్నారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అమెరికా ప్రతిపాదనలకు, తాత్కాలిక ఒప్పందాలకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీంతో యుద్ధం ఏ క్షణాన ఏ మలుపు తీసుకుంటుందో అని పశ్చిమాసియా దేశాల్లో ఆందోళన నెలకొంది.

### ఇక చర్చల్లేవ్

ట్రంప్ విధించిన గడువు ముగుస్తున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాతో జరుగుతున్న శాంతి చర్చలకు ద్వారాలు మూసేసింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వరంగ మీడియా సంస్థ టెహ్రాన్ టైమ్స్ వెల్లడించింది. 'అమెరికాతో ఉన్న అన్ని దౌత్య, పరోక్ష సంభాషణ మార్గాలను ఇరాన్ మూసివేసింది. ఇరు దేశాల మధ్య సందేశాల మార్పిడిని కూడా నిలిపివేసింది' అంటూ టెహ్రాన్ టైమ్స్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. ఈజిప్ట, పాకిస్థాన్, తుర్కియే మధ్యవర్తిత్వంలో ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలకు ముగింపు పలికింది. కాగా, ట్రంప్ ఇచ్చిన గడువు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటలు) ముగియనుంది.

## శబరిమలలో మహిళలకు 'నో' ఎంట్రీ సరైనదే: కేంద్రం

న్యూఢిల్లీ: శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వెల్లడించింది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తోంది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దిన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జ్యుడీషియల్ పరిధిలోకి రాదని చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడిగా గోపాల్ మిశ్రా

## హర్షధ్వానాలతో అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నికకు ఆమోదం.. అభినందనలు తెలిపిన పలు రాష్ట్రాల నేతలు

న్యూఢిల్లీ: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ అధ్యక్షుడుగా ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన సీనియర్ జర్నలిస్టు గోపాల్ మిశ్రా ఎన్నికయ్యారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో గత సెప్టెంబర్ నెలలో ప్రారంభమైన అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ సోమవారం న్యూఢిల్లీలో ముగిసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే, అనుబంధ సంఘాల ప్రతినిధుల ఓటింగ్ ద్వారా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ప్రధాన ఎన్నికల అధికారి(సీఆర్ఓ) సంతోష్ చతుర్వేది (ఉత్తర ప్రదేశ్), సహాయ ఎన్నికల అధికారులు (ఏసీఆర్ఓ) మామిడి సోమయ్య (తెలంగాణ), మరూఫ్ రజా (ఢిల్లీ)తదితరులు ఈ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నికను న్యూఢిల్లీలోని నిజాముద్దీన్, బి-35 లో ఉన్న జర్నలిస్ట్స్ యూనియన్ ఆఫ్ ఢిల్లీ (జేయూడీ) ప్రాంగణంలో జరిగిన ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రకటించారు. గత సంవత్సరం వరకు అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ కే. విక్రమరావు మరణించడంతో ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోపాల్ మిశ్రా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రస్తుతం వర్కింగ్ జర్నలిస్టులు రెండు వైపుల నుంచి ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఒకవైపు ఆదాయ వనరుల పతనం వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభం, మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వాడకం పెరగడం వల్ల న్యూస్ రూమ్ ల పనితీరు గందరగోళంలో పడిందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులు అకారణంగా తమ జీవనోపాధిని కోల్పోకుండా చూడటం మన మొదటి కర్తవ్యమని అన్నారు. డిజిటల్ శ్రమ వాస్తవికతను ప్రతిబింబించే వేతన రక్షణను సాధించడం మన రెండవ కర్తవ్యమని గోపాల్ మిశ్రా అన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాబోయే రోజుల్లో పోరాటం చేస్తామని అన్నారు. ఏఐఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా హాజరై, స్వర్గీయ డాక్టర్ విక్రమ్ రావును జర్నలిస్టుల శ్రేయస్సు కోసం అందించిన సేవలను కొనియాడారు. ఐఎఫ్‌డబ్ల్యూజే అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు గోపాల్ మిశ్రాను అభినందించారు. ఆయన తన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, డాక్టర్ కె. విక్రమ్ రావు చూపిన మార్గంలో నడవాలని కోరారు. నూతనంగా ఎన్నికైన ఐఎఫ్ డబ్ల్యూజే అధ్యక్షుడు గోపాల్

మిశ్రా 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' 'నేషనల్ హెరాల్డ్' పత్రికలలో సీనియర్ సంపాదకీయ పదవులను నిర్వహించారు. భారతదేశపు మొట్టమొదటి ఇంటర్నెట్ న్యూస్ పోర్టల్‌ను ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి వి.వి. గిరిచే గుర్తింపు పొందిన పయనీర్ ఎంప్లాయిస్ యూనియన్‌ను స్థాపించారు. రెండు రోజుల పాటు జరిగిన ఐఎఫ్‌డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సమావేశాల్లో సీనియర్ వర్కింగ్ కమిటీ సభ్యులు, జాతీయ ఉపాధ్యక్షుడు ఉపేంద్ర సింగ్ రాథోడ్, కోశాధికారి రజత్ మిశ్రా, కార్యదర్శులు పి. ఆనందం, కె. విశ్వదేవరావు, రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ ఖాన్ (మధ్యప్రదేశ్) తదితరులు, ఢిల్లీ జర్నలిస్ట్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హసీబ్ సిద్ధిఖీ, దేవరాజ్ సింగ్ (ఉత్తరప్రదేశ్), ప్రమోద్ దత్, సుధీర్ మధుకర్(బీహార్), సి. భూపతి(తమిళనాడు), భరత్ భూషణ్, దీపక్ కుమార్ (జార్ఖండ్), నమిత బోరా (అస్సాం), శాంత కుమారి, నారాయణ్ వైద్య(కర్ణాటక), ఓం ప్రకాష్ సింగ్, ముఖేష్ కుమార్ (మహారాష్ట్ర), బిజోయ్ పాల్ (త్రిపుర), అమిత్ రాయ్ (పశ్చిమ బెంగాల్), అరుణ్ శర్మ, ప్రయాగ్ పాండే (ఉత్తరాఖండ్), సీనియర్ పాత్రికేయులు ప్రేమ్ కాంత్ తివారీ, నితిన్ శ్రీవాత్సవ (ఉత్తరప్రదేశ్),వి. రవికుమార్ (టీడబ్ల్యూజేఎఫ్, హైదరాబాద్) తదితరులు కొత్త అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.



## కాంగ్రెస్‌కు సింగిల్ డిజిటే: హరీశ్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలవబోదని, సింగిల్ డిజిట్‌కు పరిమితమవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పరిగి ఇండస్ట్రియల్ పార్క్ బాధితులను కలవడానికి బయలుదేరడంతో పోలీసులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. శంషాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు, ఆ తర్వాత వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని వ్యాఖ్యానించారు. గత రెండున్నరేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సింగిల్ డిపాజిట్‌కు పరిమితమవుతుందని అన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించకూడదని, ఆందోళనలు, ధర్నాలు నిర్వహించరాదని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, విచారణలు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తమను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే అరెస్టు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో రామరాజ్యం లాంటి కేసీఆర్ రాజ్యం వస్తుందని అన్నారు.

## డీజీపీ కాన్వాయ్‌లో ప్రమాదం

ములుగు, ఏప్రిల్ 7 (ఈవార్తలు): డీజీపీ శివధర్ రెడ్డి కాన్వాయ్ ట్రయల్ రన్ సందర్భంగా ప్రమాదం చోటు చేసుకుంది. డీజీపీ పర్యటనకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగా ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ క్రమంలో వెంకటాపురం వద్ద వాహనాలు వేగంగా వెళుతుండగా ఒక పోలీసు వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు వెంటనే ఆ వాహనాలను పక్కకు తొలగించారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించనున్నారు. కర్రెగుట్టలోని పామునూరు సీఆర్పీఎఫ్ బస్ క్యాంపును డీజీపీ పరిశీలిస్తారు. ఆ తర్వాత పోలీసు ఔట్ పోస్టుకు భూమి పూజ చేస్తారు. ఆ ప్రాంతంలోని గ్రామాలకు వేస్తున్న రోడ్లను పరిశీలిస్తారు. డీజీపీ కర్రెగుట్ట పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆయన స్థానిక గుత్తికోయలతో సమావేశం కానున్నారు.

# నరేగాను నిర్వీర్యం చేసే కుట్ర

## పేదలపై బీజేపీ సర్కార్ కక్ష.. పని దినాలు తగ్గించి పేదల పొట్ట కొడుతున్నారు

**తెలంగాణ బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?**

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల మీద కక్ష గట్టినట్లు వ్యవహరిస్తూ వారి నోటి కాడి కూడు లాగేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి పని దినాలు తగ్గించటం, నిధులు ఇవ్వకపోవటంపై మోడీ సర్కార్ ను గట్టిగా నిలదీస్తూ వీడియో సందేశం రిలీజ్ చేశారు. పేదలకు మేలు చేసే ఉద్దేశంతో తెచ్చుకున్న ఉపాధి హామీ పథకాన్ని పథకం ప్రకారం తొలగించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి చట్టబద్ధత లేకుండా చేశారని మండిపడ్డారు. చట్టబద్ధత ఉంటే నిధులు ఇవ్వడం తప్పనిసరి అవుతుందని కానీ ఈ పథకాన్ని ఒక ప్రొగ్రామ్ గా మార్చేసి నిధులు ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. భవిష్యత్ లో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిన కూడా అడిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పని దినాలు సగానికి తగ్గింపు**

ఉపాధి హామీ పథకం వచ్చిన తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంతో కొంత మెరుగుపడిందని కవిత చెప్పారు. అలాంటి ఈ పథకం పని దినాలను తగ్గించటం, నిధులు ఇవ్వకుండా చేయటం ద్వారా గ్రామాల్లో పేదల కడుపు కొడుతున్నారన్నారు. తెలంగాణలో కొవిడ్ తర్వాత 2021-22 లో 14 కోట్ల పని దినాలు ఉంటే గతేడాది 7 కోట్లకు పని దినాలను తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఉపాధి హామీలో పని దినాలు కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రతతో, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?**

తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలను



గెలిపిస్తే...వారు ప్రజల కోసం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పేద ప్రజల నోటికాడి కూడు లాగేస్తుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అన్యాయమన్నారు. తక్షణమే కేంద్రంలోని వారి ప్రభుత్వంతో కొట్లాడి ఉపాధి హామీకి రావాల్సిన నిధులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. కరువు కాలంలో గ్రామాల్లో పేదలను ఆదుకున్న ఈ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

## కాంగ్రెస్‌ను నమ్మొద్దు

ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని విశ్వసించవద్దని, పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమిని గెలిపించాలంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేరళ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. "జై తెలంగాణ, జై కేరళం" అంటూ ప్రారంభించారు. "తెలంగాణ కూతురిగా కేరళం ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ వీడియోను విడుదల చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలో కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేశారని, ఇచ్చిన హామీలు అమలు చేశామని నమ్మించే ప్రయత్నం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో వారు ఆరు గ్యారెంటీలు ఇచ్చారని, కానీ కేవలం సగం గ్యారెంటీ 'ఉచిత బస్సు'ను మాత్రమే అమలు చేశారని పేర్కొన్నారు. తాను తెలంగాణ బిడ్డనని, త్వరలో రాజకీయ పార్టీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో కేరళ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. ఆడపడుచులకు నెలకు రూ.2,500, యువతకు ఉద్యోగాలు, రైతులకు బోనస్, పెన్షన్ పెంపు వంటి హామీలు ఇచ్చి కూడా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారిందని ఆరోపించారు. అవినీతి ద్వారా తెలంగాణ నుంచి వచ్చిన సొమ్మును కాంగ్రెస్ కేరళలో ఖర్చు చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎల్డీఎఫ్‌కు ఓటు వేయాలని కోరారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## రూ.64.35 లక్షల డ్రగ్స్ సీజ్

చిలకలగూడ-హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకున్నారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, రూ.64.35 లక్షల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50,000 నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో ఆ తర్వాత డ్రగ్స్ వ్యాపారంలోకి వచ్చారని చెప్పారు.

# దేవుడినే శాసిస్తామనే అహంకారం మీది

**బ్రాహ్మణులపై మందకృష్ణ వివాదాస్పద వ్యాఖ్యలు**



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): బ్రాహ్మణ సామాజిక వర్గంపై ఎంఆర్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో వేల ఏళ్లుగా కొనసాగుతున్న కుల వ్యవస్థకు, సామాజిక అసమానతలకు బ్రాహ్మణులే మూలకారణమని ఆయన ఆరోపించారు. "భారతదేశంలో కుల వ్యవస్థను సృష్టించి, మనుషుల మధ్య గోడలు కట్టింది బ్రాహ్మణులే. రాజుల కాలం నుండి, బ్రిటీషర్ల పాలన వరకు అన్ని కాలాల్లోనూ వారిదే ఆధిపత్యం నడిచింది" అని మందకృష్ణ మండిపడ్డారు. కేవలం బ్రాహ్మణుల ఆధిపత్యం కారణంగానే నాడు అణగారిన వర్గాలకు, బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు కల్పించాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. కేవలం ఎస్సీలు మాత్రమే కాదు, మిగతా అన్ని వర్ణాల వారు కూడా బ్రాహ్మణ ఆధిపత్యానికి బాధితులేనని ఆయన వ్యాఖ్యానించారు. సమాజంలోని మెజారిటీ ప్రజలను తక్కువ చేసి చూడటం వారి నైజమని విమర్శించారు. "మంత్రాలతో దేవుడినే శాసిస్తాం అనేంత అహంకారం బ్రాహ్మణులది. దేవుడినే శాసించే శక్తి తమకు ఉందని భావించే వారికి.. సామాన్య ఎస్సీలు లేదా ఇతర కులాల వారు అంటే లోకువగా ఉండటంలో ఆశ్చర్యం లేదు" అని ధ్వజమెత్తారు. అందుకే బ్రాహ్మణులు సృష్టించిన ఈ కుల వివక్షకు వ్యతిరేకంగా అన్ని వర్గాల వారు ఏకమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం కోసం ఈ ఆధిపత్య భావజాలాన్ని అంతం చేయాలని ఉద్ఘాటించారు. మందకృష్ణ చేసిన ఈ వ్యాఖ్యలపై బ్రాహ్మణ సంఘాలు తీవ్రంగా రియాక్ట్ అయ్యాయి. దేశంలో కుల వ్యవస్థతో పాటు రిజర్వేషన్లూ రద్దు చేయాలని బ్రహ్మణ సంఘం నేత ద్రోణంరాజు రవికుమార్ డిమాండ్ చేశారు. అలా చేస్తామంటే మందకృష్ణ మాటలకు తప్పకుండా హర్షిస్తామని పేర్కొన్నారు. నిజాయితీకి, నిబద్ధతకు బ్రాహ్మణులు కేరాఫ్ అడ్రస్ అని అన్నారు.

# అరెస్టులు మాకు కొత్త కాదు

**బీఆర్ఎస్ నేతలను నిర్బంధించడంపై కేటీఆర్ ఫైర్**



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): పరిగి భూసేకరణ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టులు, గృహనిర్బంధాలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఆయన 'పిరికిపంద చర్యలు'గా అభివర్ణించారు. పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతు తెలపడం నేరమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ వంటి నేతలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. "అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను ఎదుర్కొన్నాం. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాం" అని స్పష్టం చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల అనుమతి లేకుండా సాగిస్తున్న బలవంతపు భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


ఆహ్వానం పలుకుతోంది..

నేటి ఈవార్తలు

సంచలనాత్మక కథనాలు, వాస్తవ సమచారాన్ని అందిస్తూ ప్రధాన పత్రికలకు దీటుగా అతి తక్కువ కాలంలోనే తెలుగు పాఠకుల ఆదరాభిమానాలు సంపాదించిన 'ఈవార్తలు' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణవ్యాప్తంగా విలేకరులు కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఆసక్తి కలిగినవారు బయోడేటాను 9440455811కు వాట్సాప్ contact@evarthalu.comకు మెయిల్ గానీ చేయవచ్చు.



## గుండెపోటుతో 9 ఏళ్ల బాలుడు మృతి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పోరండ్లలో 9 ఏళ్ల బాలుడు గుండెపోటుతో మరణించాడు. 3వ తరగతి చదువుతున్న నిశాంత్ అనే బాలుడు.. వ్యవసాయ పొలం వద్ద ఉన్న శివాలయంలో అన్నదానం చేస్తుండగా ఒక్కసారి కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే నిశాంత్ తుదిశ్వాస విడిచాడు. నిశాంత్ తండ్రి చంద్రశేఖర్ జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. చంద్రశేఖర్ దంపతులకు నిశాంత్ ఒక్కడే కొడుకు.

## కోర్టు కానిస్టేబుల్ కిరణ్‌కు ప్రశంసాపత్రం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 7 (ఈవార్తలు): జాతీయ లోక్ అదాలత్ లో వివిధ కేసుల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు పాటుపడుతూ, ఉత్తమ సేవలందించినందుకుగానూ మల్యాల పోలీస్ స్టేషన్‌కు చెందిన కోర్టు కానిస్టేబుల్ అనసూరి కిరణ్ మంగళవారం జిల్లా న్యాయస్థానం ఆవరణలో జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జడ్జి రత్న ప్రభావతి, ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో సేవలందించిన పలువురు ఎస్సైలు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు (కోర్టు కానిస్టేబుల్)కు ప్రశంస పత్రాలు అందజేశారు. కిరణ్ ప్రశంసాపత్రం పొందడం పట్ల మల్యాల పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనను అభినందించారు.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు 7గురు విద్యార్థుల ఎంపిక




గద్వాల, ఏప్రిల్ 7 (ఈవార్తలు): జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆరగిద్ద ప్రాథమిక పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 30 మంది విద్యార్థులు ఎంపిక కాగా, ఒక్క ఆరగిద్ద పాఠశాల నుంచే ఏడుగురు బరిలోకి దిగబోతున్నారు. వారిలో బీ అభి, కే సంజయ్, కమ్మరి జ్యోతి, బీ స్వప్న, అంజలి, ఎస్ వెన్నెల, కురువ జ్యోతి ఉన్నారు. విద్యార్థులకు బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మహ్మద్ ఇర్ఫాన్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలియజేశారు.

## ఏపీకి 39,436 కోట్ల ప్రాజెక్టులు

### గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఎస్ఐపీబీ

అమరావతి, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక ప్రగతి పథంలో పరుగులు పెట్టించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తూ, రూ.39,436.84 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మంగళవారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 16వ ఎస్ఐపీబీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, కె. అచ్చెన్నాయుడు, పి. నారాయణ, కందుల దుర్గేశ్, టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సహా పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో ఈ కొత్త పెట్టుబడులు రానున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టులపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా, అమరావతి క్వాంటం వ్యాలీలో మూడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుకు కూడా ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోనూ పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, వాటి ద్వారా లభించే ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పొందుపరచడం ద్వారా ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.



## శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలే

తిరుమల, ఏప్రిల్ 7 (ఈవార్తలు): తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి సర్వదర్శనానికి కేవలం 6 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. ముందు రోజుతో పోలిస్తే రద్దీ కాస్త తగ్గడంతో భక్తులు త్వరగా స్వామివారిని దర్శించుకోగలుగుతున్నారు. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం, నిన్న సోమవారం (ఏప్రిల్ 6) శ్రీ వేంకటేశ్వర స్వామిని మొత్తం 77,294 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 26,796 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒక్కరోజే శ్రీవారి హుండీకి కానుకల రూపంలో రూ. 4.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 7 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు దర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. రద్దీ తగ్గడంతో సామాన్య భక్తులకు దర్శనం వేగంగా జరుగుతోంది.

## రాజ్ కసిరెడ్డికి బెయిల్ మంజూరు

అమరావతి, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భారీ ఊరటను కల్పించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. సుమారు ఏడాది కాలంగా జైల్లో ఉన్న ఆయనకు ఈ నిర్ణయం ఊరటనిచ్చింది. గతేడాది ఏప్రిల్ 25న సిట్ అధికారులు రాజ్ కెసిరెడ్డిని అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారు. గతంలో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ కోర్టు వాటిని తిరస్కరించింది. అయితే, తాజాగా విచారణ చేపట్టిన హైకోర్టు కొన్ని నిబంధనలతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

## అమరావతికి అసలైన పరీక్ష ఇప్పుడే: విజయసాయిరెడ్డి

విజయవాడ, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ నిర్ణయాన్ని చారిత్రాత్మక చర్యగా అభివర్ణించిన ఆయన, రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. అయితే, అసలు పరీక్ష ఇప్పుడేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. “ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ గౌరవనీయ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారు ఆమోదముద్ర వేయడాన్ని నేను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను. 2024 జూన్ 2 నుంచి ఇది అమల్లోకి రావడం ఒక చారిత్రాత్మక ముందడుగు. అయితే, ఈ నిర్ణయం చరిత్రాత్మకమైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం దీనిని ఎలా అమలు చేస్తుందన్నదే అసలైన సవాల్. 2014 నుంచి ఏడేళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ, ఒక ప్రాధాన్య నగరం చూడాల్సినంత అభివృద్ధిని అమరావతిలో చూపించలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా అమరావతిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా, రాజధాని విషయంలో ఇతర ప్రణాళికలతో ముందుకు వెళ్లింది. ఈ విషయంలో నా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. గతంలో పేదలకు ఇచ్చిన 50,000 పట్టాలను రద్దు చేశారు. వాటిని వెంటనే పునరుద్ధరించాలి. అదే సమయంలో, అమరావతిలో మౌలిక సదుపాయాలను నిర్మించాలి. అమరావతి నిజమైన ప్రజా రాజధానిగా, కులం, మతం, వర్గాలకు అతీతంగా అందరినీ కలుపుకొనిపోయే రాజధానిగా రూపుదిద్దుకోవాలి. అదే నా ఆకాంక్ష” అంటూ విజయసాయి స్పష్టం చేశారు.

## ‘మావిగన్’ డైవర్షన్ కోసమే

# రాధాకృష్ణ వ్యాఖ్యలు: జగన్



తాడేపల్లి, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఏబీఎన్–ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ నాయకుల భార్యలను ఉద్దేశించి రాధాకృష్ణ అత్యంత అసహ్యకరమైన, దిగజారిన భాషను ఉపయోగించారని, ఇది మహిళలను ఉద్దేశపూర్వకంగా అవమానించడమేనని జగన్ తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు కేవలం విమర్శ కాదని, మహిళల ఆత్మగౌరవంపై చేసిన దాడిగా భావించాలని ఆయన అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేశారు. ‘రేపు వైయస్ జగన్ మోహన్ రెడ్డి.. మీ భార్యలను మీ భార్యలు కాదని చెబితే, మీరు దాన్ని నమ్మి, మీ సొంత భార్యలను.. అక్కచెల్లెళ్లుగా భావించి మరీ పెళ్లి సంబంధాలు చూసే స్థాయికి దిగజారిపోతారు. అంతగా వెన్నెముకలేని నాయకులు వైసీపీలో ఉన్నారు!” అంటూ వేమూరి రాధాకృష్ణ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ లో వ్యాఖ్యానించారు. మహిళలను ఉద్దేశించి ఇలాంటి అసహ్యకరమైన, దిగజారిన భాషను ఉపయోగించడం, వారిని రాజకీయ చర్చల్లోకి లాగడం విమర్శ కానే కాదు. ఆ వ్యాఖ్యలు మహిళలను అవమాన పరచడమే కాకుండా, వారిని కించపరిచేలా చేసిన దాడిగానే భావించాలి. ఎలాంటి వివక్ష పూరిత జర్నలిజం చేస్తున్నారన్నదానిపై ఈ వ్యాఖ్యలు తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇవి మహిళలను అవమానించడానికే కాదు, ప్రజల్లో ‘మావిగన్’ ప్రతిపాదనపై జరుగుతున్న చర్చను దారి మళ్లించడానికి ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం. ‘మావిగన్’ ప్రతిపాదనను రాజకీయంగా ఎదుర్కోలేక, చంద్రబాబు, ఆయనకు అనుకూలంగా ఉన్న మీడియా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోంది. దీంట్లో భాగంగా తప్పుడు ప్రచారాలు చేయడమే కాకుండా దూషణలకు కూడా దిగారు. మేము శాంతియుతంగా నిరసనలు చేపట్టి, రాధాకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాం. ఇంత తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, మా నాయకులు, కార్యకర్తలు ఎక్కడా హింసకు పాల్పడకుండా, శాంతియుతంగా, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ అత్యంత సంయమనంతో వ్యవహరించారు. ఈ జుగుప్సాకర వ్యాఖ్యలను ఖండించకుండా, చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలకు మద్దతు ఇవ్వడం, మహిళల పట్ల వారికి ఉన్న అవమానకర ధోరణిని, ద్వేషభావాన్ని చూపిస్తోంది. రాధాకృష్ణపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. బాధ్యతారహిత, విషపూరిత వ్యాఖ్యలను సమర్థించిన నాయకుల వైఖరిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం” అంటూ జగన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

## ఏపీ అగ్నిమాపక శాఖకు కొత్త రూపు



అమరావతి, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. శాఖ ఆధునికీకరణలో భాగంగా మొత్తం రూ.252.93 కోట్లతో చేపట్టిన ప్రణాళికలో తొలి దశగా, రూ.33.25 కోట్ల విలువైన నూతన వాహనాలు, అత్యాధునిక పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జెండా ఊపి కొత్త వాహనాలను సేవలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా అధికారులు కొనుగోలు చేసిన పరికరాలు, వాహనాల పనితీరును ముఖ్యమంత్రికి వివరించారు. తొలి విడతలో భాగంగా రూ.18 కోట్ల వ్యయంతో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంపులు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 అత్యవసర రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను ప్రభుత్వం సమకూర్చింది. కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించుకుని ఈ పరికరాలను అందుబాటులోకి తెచ్చిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడటానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. రాజధానితో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఎత్తైన భవనాల (హై–రైజ్ బిల్డింగ్‌లు) నిర్మాణం పెరుగుతున్నందున, వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ ఆధునిక పరికరాలను సమకూర్చుకోవాలని సూచించారు. గతంలో అగ్నిమాపక విభాగంలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేదని, మళ్లీ అదే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సైతం సహాయం చేసిన ఘనమైన చరిత్ర మనకు ఉందని గుర్తుచేశారు. అన్ని సవాళ్లను అధిగమించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా సద్వినియోగం చేసుకుని అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి ఆఫీస్‌ను తగలబెడతాం: రోజా



తాడేపల్లి, ఏప్రిల్ 7 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నేతలు దాడికి యత్నించిన సంగతి తెలిసిందే. మరోవైపు తిరుపతిలో ఆంధ్రజ్యోతికి వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ... ఆ సంస్థ ఎండీ వేమూరి రాధాకృష్ణపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జర్నలిజం పేరుతో రాధాకృష్ణ బ్రోకరిజం చేస్తున్నారని, మహిళలను కించపరిచేలా వ్యవహరిస్తే ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. రాధాకృష్ణ డొక్కు సైకిల్‌పై వచ్చి వేల కోట్లకు ఎలా ఎదిగారో అందరికీ తెలుసని రోజా అన్నారు. చంద్రబాబుకు బ్రోకర్‌గా పనులు చేస్తూ ‘కొత్త పలుకు’ పేరుతో కొవ్వెక్కి మాట్లాడుతున్నారని... ఆ కొవ్వును కరిగిస్తామని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ మహిళా నేతల గురించి, నాయకుల కుటుంబ సభ్యుల గురించి తప్పుగా రాస్తే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని తగలబెడతామని హెచ్చరించారు. “మీరు తిట్టిస్తే... మాకు తిట్టడం రాక కాదు, మా సంస్కారం అడ్డు వస్తోంది. మేము తిట్టడం మొదలుపెడితే మీరు రోడ్లపై తిరగలేరు” అని కూటమి నేతలను ఉద్దేశించి రోజా అన్నారు. చంద్రబాబు రాయలసీమలో పుట్టి ఈ ప్రాంతానికే ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం 2 వేల కోట్లు ఖర్చు చేయలేని వ్యక్తి, అమరావతికి 2 లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో చంద్రబాబు చీకటి ఒప్పందాలు చేసుకుని ఏపీ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపించారు. 87 శాతం పూర్తయిన రాయలసీమ ప్రాజెక్టులను నిలిపివేయడం అంటే ఈ ప్రాంత ప్రజల గొంతు కోయడమేనని, దీనిపై మహా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.

## చంద్రబాబు మళ్లీ తప్పు చేస్తున్నారు: ధర్మాన



శ్రీకాకుళం, ఏప్రిల్ 7 (ఈవార్తలు): అభివృద్ధి వికేంద్రీకరణే అసలైన ప్రజాస్వామ్యమని, కూటమి ప్రభుత్వం కేవలం ఒకే ప్రాంతానికి ప్రాధాన్యతనిస్తూ ఉత్తరాంధ్ర, రాయలసీమలకు అన్యాయం చేస్తోందని ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. శ్రీకాకుళంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఆయన ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో హైదరాబాద్‌పైనే నిధులు కుమ్మరించడం వల్ల ఏపీకి నష్టం జరిగిందని, ఇప్పుడు అమరావతి విషయంలో చంద్రబాబు మళ్లీ అదే తప్పు చేస్తున్నారని హెచ్చరించారు. శ్రీకృష్ణ కమిటీ సూచనలను పెడచెవిన పెట్టడం సరికాదన్నారు. నిపుణుల కమిటీ నివేదికలను కాదని, రాజ్యాంగ విరుద్ధంగా అమరావతిని శాశ్వత రాజధానిగా మార్చారని ఆరోపించారు. దీని కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చట్ట సవరణ చేయించారని పేర్కొన్నారు. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్ర ప్రజలు వలస వెళుతున్నారని ధర్మాన ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. రూ. 3.30 లక్షల కోట్ల బడ్జెట్‌లో శ్రీకాకుళం ప్రాజెక్టులకు రూ. 1,000 కోట్లు కూడా ఇవ్వరా? అని ప్రశ్నించారు. అమరావతి మౌలిక వసతులకే రూ. 2 లక్షల కోట్లు కావాలని, అది పూర్తి కావడానికి 50 ఏళ్లు పడుతుందని స్వయంగా సీఎం చెబుతున్నారని విమర్శించారు. అన్ని ప్రాంతాలను సమానంగా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని అన్నారు.

## ఏపీ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి అరెస్ట్

విజయవాడ, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం ఆమె నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో భారీగా అక్రమాస్తులు బయటపడటంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. శాంతిని విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఏప్రిల్ 21 వరకు రిమాండ్ విధించారు. దాంతో ఆమెను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. మంగళవారం ఉదయం తాడేపల్లి, ఉండవల్లితో పాటు మొత్తం నాలుగు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. సుమారు ఆరు గంటల పాటు సాగిన ఈ సోదాల్లో విశాఖపట్నం ఎండాడలో ఒక విలాసవంతమైన ఫ్లాట్, తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జీ+2 భవనాన్ని గుర్తించారు. వీటితో పాటు 770 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి వస్తువులు, రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం ఉన్నట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. కాళింగిరి శాంతి గతంలోనూ పలు వివాదాలతో వార్తల్లో నిలిచారు. అక్రమాల ఆరోపణల కారణంగా గత ఏడాది జులై నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఆమె సస్పెన్షన్‌లో ఉన్నారు. హైకోర్టు ఆదేశాలతో ఇటీవలే ఆమెను విధుల్లోకి తీసుకున్నారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పేరుతో ముడిపడి పలు ఆరోపణలు రాగా, వాటిని ఆమెతో పాటు విజయసాయిరెడ్డి కూడా ఖండించడం తెలిసిందే.




## ‘ఎన్టీఆర్ వైద్య సేవ’ పునఃప్రారంభం

విజయవాడ, ఏప్రిల్ 7 (ఈవార్తలు): ఏపీవ్యాప్తంగా నిలిచిపోయిన ‘ఎన్టీఆర్ వైద్య సేవ’ పథకం తిరిగి ప్రారంభమైంది. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించడంతో ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ (ఆషా) తమ సమ్మెను విరమించుకుంది. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో యథావిధిగా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించడంతోనే సమ్మె విరమించినట్లు ‘ఆషా’ ప్రతినిధులు తెలిపారు. మొత్తం బకాయిల్లో భాగంగా రూ.1,000 కోట్లను 10 రోజుల్లో చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మిగిలిన రూ.1,000 కోట్ల బకాయిలను రెండో త్రైమాసికంలో చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. ఈ హామీతో నెట్‌వర్క్ ఆసుపత్రులు తమ సేవలను పునరుద్ధరించాయి. గత కొంతకాలంగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో ‘ఆషా’ సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. దీనివల్ల ‘ఎన్టీఆర్ ఆరోగ్య సేవ’ పథకం కింద చికిత్స పొందే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం, ‘ఆషా’ మధ్య ఒప్పందం కుదరడంతో రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం మళ్లీ అందుబాటులోకి వచ్చింది. ఇచ్చిన హామీలను ప్రభుత్వం సకాలంలో నెరవేరుస్తుందని ఆశిస్తున్నట్లు ‘ఆషా’ వర్గాలు పేర్కొన్నాయి.

# విజయ్ నామినేషన్లు పాస్

## రెండు చోట్లా తొలగిన అడ్డంకులు

చెన్నై: నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తుండడం తెలిసిందే. ఆయన దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లో కొన్ని తప్పులు దొర్లడంతో అధికారులు వాటిని హోల్డ్ లో ఉంచారు. తాజాగా, విజయ్ సవరించిన అఫిడవిట్లను సమర్పించడంతో పెరంబూర్, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాల్లో ఆయన నామినేషన్లను ఎన్నికల అధికారులు ఆమోదించారు. విజయ్ మార్చి 30న చెన్నైలోని పెరంబూర్, ఏప్రిల్ 2న తిరుచ్చి తూర్పు నియోజకవర్గాల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ఈ రెండు అఫిడవిట్లలోని వివరాల్లో తేడాలు ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తిరుచ్చి అఫిడవిట్‌లో తనపై రెండు క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొన్న విజయ్, పెరంబూర్ అఫిడవిట్‌లో మాత్రం ఎలాంటి కేసులు లేవని తెలిపారు. అలాగే, వయసు విషయంలోనూ పెరంబూర్‌లో 52 ఏళ్లుగా, తిరుచ్చిలో 51 ఏళ్లుగా ప్రకటించారు. ఈ తప్పులపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరగడంతో విజయ్ బృందం వెంటనే స్పందించింది. ఏప్రిల్ 4న పెరంబూర్ నియోజకవర్గానికి సంబంధించిన అఫిడవిట్‌ను సవరించి, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మళ్లీ సమర్పించింది. ఇందులో తన వయసును 51 ఏళ్లుగా సరిదిద్దడంతో పాటు, రెండు క్రిమినల్ కేసుల వివరాలను కూడా పొందుపరిచారు. కొళత్తూరులో నిరసన సందర్భంగా ఒక కేసు, గతేడాది మధురైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఘర్షణకు సంబంధించి మరో కేసు నమోదైనట్లు వెల్లడించారు. గడువులోగా తప్పులను సరిదిద్దడంతో నామినేషన్లను తిరస్కరించేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవని అధికారులు స్పష్టం చేశారు. డీఎంకే, పలువురు స్వతంత్ర అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, అధికారులు వాటిని పరిగణనలోకి తీసుకోకుండా రెండు చోట్లా విజయ్ నామినేషన్లను ఆమోదించారు. మరోవైపు, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు ప్రముఖ నేతల నామినేషన్లు కూడా ఆమోదం పొందాయి.



## టర్కీలో ఇజ్రాయెల్ కాన్సులేట్ వద్ద కాల్పులు

### ముగ్గురు సాయుధుల హతం

ఇస్తాంబుల్: టర్కీలోని ఇస్తాంబుల్‌లో మంగళవారం తీవ్ర కలకలం రేగింది. మూసివున్న ఇజ్రాయెల్ కాన్సులేట్ భవనం వెలుపల పోలీసులకు, దుండగులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు దాడి చేసిన వ్యక్తులు హతమయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. బెసిక్తాస్ జిల్లాలోని కాన్సులేట్ భవనం వద్ద ఈ కాల్పులు చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. టర్కీ అంతర్గత వ్యవహారాల మంత్రి ముస్తఫా సిఫ్టీ ఈ ఘటనపై స్పందిస్తూ.. పోలీసులతో సాయుధ పోరాటానికి దిగిన ముగ్గురు వ్యక్తులను మట్టుబెట్టినట్లు ధృవీకరించారు. హతమైన ఉగ్రవాదుల వివరాలను గుర్తించినట్లు వెల్లడించారు. వారు ఇజ్మిత్ నుంచి అద్దె వాహనంలో ఇస్తాంబుల్ వచ్చినట్లు తెలిపారు. వీరిలో ఒకరికి మతపరమైన తీవ్రవాద సంస్థతో సంబంధాలున్నాయని, సోదరులైన ఇద్దరిలో ఒకరికి డ్రగ్స్ కేసులో రికార్డు ఉందని ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. ఈ ఘటనపై ఇస్తాంబుల్ చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం వెంటనే దర్యాప్తు ప్రారంభించిందని టర్కీ న్యాయశాఖ మంత్రి అకిన్ గుర్లెక్ తెలిపారు. ఒక డిప్యూటీ చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో కూడిన బృందం సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టిందని వివరించారు. ఇస్తాంబుల్ గవర్నర్ దావూత్ గుల్ మాట్లాడుతూ.. సుమారు రెండున్నరేళ్లుగా ఈ కాన్సులేట్ భవనాన్ని దౌత్యపరమైన కార్యకలాపాలకు ఉపయోగించడం లేదని స్పష్టం చేశారు. ఘటన జరిగిన సమయంలో అక్కడ దౌత్య సిబ్బంది ఎవరూ లేరని ప్రాథమిక అంచనాల్లో తేలింది.

## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా

గౌహతి: పశ్చిమ బెంగాల్‌లో ఒక్కసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మార్పు మొదలవుతుందని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది బీజేపీకే సాధ్యమని అన్నారు. అసోంలోని బరాక్ ప్రాంతంలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీనితో ఆయన ఇక్కడ చొరబాటుల అంశాన్ని ప్రస్తావించారు. పౌరసత్వ చట్టసవరణ ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని అన్నారు. కానీ ఈ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోందని విమర్శించారు. అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయమిచ్చేందుకు భారత్ ఏమీ ధర్మసత్రం కాదని వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో బీజేపీకి అధికారం ఇస్తే మార్పు చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో ఇప్పటికే తిష్టవేసిన చొరబాటుదారులను వారి దేశానికి తరిమికొడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదని విమర్శించారు. రాహుల్ గాంధీ నిరసనకారులను కూడా ప్రశంసిస్తారని ఎద్దేవా చేశారు. అస్సామీ, బెంగాలీలను సంప్రదాయ భాషలుగా ప్రకటించేందుకు మోదీ ఆలోచన చేస్తున్నారని తెలిపారు.




# కేరళంలో ముగిసిన ప్రచార హోరు

### రేపు పోలింగ్.. గెలుపు ఎవరిదో?

తిరువనంతపురం: కేరళం అసెంబ్లీ ఎన్నికల హోరాహోరీ ప్రచారానికి మంగళవారం సాయంత్రం 6 గంటలతో తెరపడింది. మూడు వారాలకు పైగా సాగిన ఈ ఉత్కంఠభరిత రాజకీయ యజ్ఞం ముగియడంతో రాష్ట్రమంతా ఇప్పుడు ఏప్రిల్ 9న జరిగే పోలింగ్ కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. ప్రచార పర్వం ముగియడంతో ఇక బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మైకులు మూగబోనున్నాయి. ప్రచారానికి చివరి రోజైన మంగళవారం కేరళం వీధులు పండుగ వాతావరణాన్ని తలపించాయి. అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్, ఎన్డీఏ కూటములకు చెందిన అభ్యర్థులు, కార్యకర్తలు భారీ రోడ్ షోలు, డప్పు చప్పుళ్లు, రంగురంగుల ఊరేగింపులతో హోరెత్తించారు. తమ అభ్యర్థే గెలవబోతున్నారన్న ధీమాతో ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు కనిపించడం ఈ చివరి ఘట్టం ప్రత్యేకత. ఇది కేరళం రాజకీయ సంస్కృతికే ప్రత్యేకం అనదగ్గ రీతిలో, ఒక భారీ శక్తి ప్రదర్శనగా నిలిచింది. చట్టప్రకారం నాయకులందరూ తమ తమ నియోజకవర్గాలకు తిరిగి వెళ్లి, పోలింగ్‌కు ముందు చివరి వ్యూహాలపై దృష్టి సారిస్తారు. ఆ తర్వాత గురువారం అసలైన సమరానికి తెరలేస్తుంది. రాష్ట్రంలోని 2.71 కోట్ల మంది ఓటర్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) బటన్ నొక్కి, తమ తీర్పును వెలువరించనున్నారు. ఈ ఎన్నికల బరిలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ చారిత్రక విజయంపై కన్నేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి కేరళం రాజకీయాల్లో అపూర్వమైన రికార్డు సృష్టించాలని ఆయన భావిస్తున్నారు. అభివృద్ధి, కొనసాగింపు నినాదాలతో ఎల్డీఎఫ్ ప్రజల ముందుకు వెళ్లింది. అయితే, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి మాత్రం గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తోంది. వయనాడ్‌లో ప్రచారం చేసిన ప్రియాంక గాంధీ, ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసొస్తుందని, సునాయాసంగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మరోవైపు, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఈసారి కేరళంలో తమ ఉనికిని బలంగా చాటాలని చూస్తోంది. 2021లో ఒక్క సీటు కూడా గెలవని ఆ పార్టీ, ఈసారి కచ్చితంగా ఖాతా తెరవడమే కాకుండా, పలు స్థానాలు గెలిచి రాష్ట్ర రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి, పినరయి విజయన్ వంటి నేతల మధ్య జరిగిన వాడీవేడీ మాటల యుద్ధం కూడా రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది.





# కేరళంలో బీజేపీ 'జీరో సీట్ల పార్టీ'

### ఆ పార్టీకి ఓటు వేస్తే వృథా

### కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్



తిరువనంతపురం: కేరళం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఒక 'జీరో సీట్ల పార్టీ' అని, ప్రస్తుతం అసెంబ్లీలో ఆ పార్టీకి ప్రాతినిధ్యం లేదని ఎద్దేవా చేశారు. ఒకవేళ ఆ పార్టీ అద్భుతం చేసి ఒకటి, రెండు లేదా మూడు సీట్లు గెలిచినా, ప్రభుత్వం ఏర్పాటులో మాత్రం బీజేపీ ఏమాత్రం ప్రభావం చూపలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కేరళంలో తరచూ పర్యటిస్తున్నప్పటికీ, ఆ ప్రభావం రాష్ట్ర ఎన్నికలపై ఉండదని అన్నారు. "ప్రధాని మోదీ ఇక్కడ ముఖ్యమంత్రి కారు కదా అని ప్రజలకు బాగా తెలుసు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి లభించే ఆదరణ, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిర్ణయించే అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించదు" అని థరూర్ విశ్లేషించారు. ఈ నేపథ్యంలో, వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్డీఎఫ్) ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ఓట్లను బీజేపీకి వేసి వృథా చేసుకోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మార్పు కోరుకునేవారు యూడీఎఫ్‌కు ఓటు వేయాలని, తద్వారా బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. కేరళంలో పినరయి విజయన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఈసారి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్ ప్రభుత్వ పాలనను థరూర్ తప్పుబట్టారు. గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో తామే ప్రగతి సాధించామని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఊమెన్ చాందీ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రభుత్వం ఇంతకంటే మెరుగైన ఫలితాలు సాధించిందని గుర్తుచేశారు. వామపక్షాలు వ్యతిరేకించినప్పటికీ, విళింజం పోర్టు వంటి కీలక ప్రాజెక్టులను యూడీఎఫ్ హయాంలోనే ప్రారంభించామని తెలిపారు. వయనాడ్‌లో విపత్తుల నిర్వహణలోనూ ప్రభుత్వం విఫలమైందని, విపత్తులు సంభవించినప్పుడు బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వానిదేనని అన్నారు. ఇక ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై అడిగిన ప్రశ్నకు, అది పూర్తిగా ఊహాజనితమని థరూర్ కొట్టిపారేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒక స్పష్టమైన ప్రక్రియ ఉందని, ఎన్నికల తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలు, పార్టీ అధిష్ఠానం కలిసి ముఖ్యమంత్రిని నిర్ణయిస్తాయని తెలిపారు. కేరళంలో ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## కేరళం ఆలయాలకు అనంత్ అంబానీ రూ.18 కోట్ల విరాళం



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ కేరళంలోని ప్రఖ్యాత ఆలయాల అభివృద్ధి, ఏనుగుల సంరక్షణ కోసం భారీ విరాళం ప్రకటించారు. మొత్తం రూ.18 కోట్లు అందించనున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన ప్రసిద్ధ రాజరాజేశ్వరం, గురువాయూర్ ఆలయాలను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా రాజరాజేశ్వరం ఆలయానికి రూ.3 కోట్లు, గురువాయూర్ ఆలయానికి రూ.3 కోట్లు విరాళంగా అందజేశారు. దీనికి అదనంగా, రాజరాజేశ్వరం ఆలయంలో 200 ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న పురాతన తూర్పు గోపురం పునరుద్ధరణ పనుల కోసం మరో రూ.12 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాజరాజేశ్వరం ఆలయంలో అనంత్ అంబానీ ప్రత్యేక పూజలు చేసి, సంప్రదాయ ఆచారాలు పాటించారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన రూ.3 కోట్ల చెక్కును టీటీకే దేవస్వోం అధ్యక్షుడు టీపీ వినోద్ కుమార్, ఈవో కేపీ వినయన్ వంటి అధికారులకు అందించారు. అనంతరం గురువాయూర్ ఆలయంలోనూ ప్రార్థనలు చేసి రూ.3 కోట్లు విరాళమిచ్చారు. అంతేకాదు, గురువాయూర్ ఆలయంలోని ఏనుగుల సంక్షేమానికి కూడా అనంత్ ప్రాధాన్యత ఇచ్చారు. తన వన్యప్రాణి సంరక్షణ కార్యక్రమం 'వంతార' ద్వారా ఏనుగుల కోసం ఆధునిక ఆసుపత్రి, గొలుసులు లేని ఆశ్రయాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఏనుగుల జీవన పరిస్థితులను మెరుగుపరచి, వాటికి శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షణ అందించడమే తమ లక్ష్యమని వివరించారు. "భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాదు. అవి విశ్వాసం, సమాజం, కరుణ, ప్రకృతితో మనకున్న సంబంధాన్ని పోషించే జీవన సంస్థలు. ఈ పవిత్ర వారసత్వాన్ని భవిష్యత్ తరాల కోసం కాపాడటం మనందరి బాధ్యత" అని ఈ సందర్భంగా అనంత్ అంబానీ అన్నారు. తమ సేవల ద్వారా భక్తుల అనుభవాన్ని మెరుగుపరచడంతో పాటు, జంతువులకు గౌరవంతో కూడిన సంరక్షణ అందించాలని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పైలట్ల పనివేళలపై సడలింపులు

### డీజీసీఏ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ విమానాలు సుదీర్ఘమైన మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తుండటంతో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. సుదూర విమానాలకు సంబంధించి పైలట్ల డ్యూటీ సమయ పరిమితుల్లో తాత్కాలికంగా కొన్ని సడలింపులు ఇచ్చినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. ఈ విషయాన్ని మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ అసాంగ్బా చుబా ఏవో మీడియాకు వెల్లడించారు. మధ్యప్రాచ్యంలోని పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడంతో, పశ్చిమ దేశాలకు వెళ్లే విమానాలు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల విమాన ప్రయాణ సమయం పెరిగి, కొత్త డ్యూటీ నిబంధనలను పాటించడం విమానయాన సంస్థలకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ఏప్రిల్ 30 వరకు ఇలాంటి సడలింపులు ఇచ్చారు. తాజా సడలింపుల ప్రకారం, ఇద్దరు పైలట్లు నడిపే సుదూర విమానాల్లో 'ఫ్లైట్ టైమ్'ను 1.30 గంటలు అదనంగా పెంచి, మొత్తం 11.30 గంటలకు పొడిగించారు. అదేవిధంగా 'ఫ్లైట్ డ్యూటీ పీరియడ్'ను 1.45 గంటలు పెంచి 11.45 గంటలుగా నిర్ధారించారు. విమానం టేకాఫ్ కోసం కదలడం ప్రారంభించినప్పటి నుంచి, గమ్యస్థానం చేరాక పూర్తిగా ఆగిపోయే వరకు పట్టే సమయాన్ని 'ఫ్లయింగ్ టైమ్'గా పరిగణిస్తారు. పైలట్ల అలసటను తగ్గించి, విమాన భద్రతను పెంచేందుకు డీజీసీఏ గతేడాది కఠినమైన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం పైలట్లకు ఇచ్చే వరుస విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచారు. ఈ సడలింపులు తాత్కాలికమే అయినప్పటికీ, సిబ్బంది లభ్యత, నిబంధనల పాటింపు వంటి అంశాలపై విమానయాన సంస్థలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని డీజీసీఏ అధికారులు తెలిపారు.

## మార్కెట్ల దూకుడు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాల బాటలో పయనించాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 507.73 పాయింట్లు పెరిగి 74,616.58 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 155.40 పాయింట్లు లాభపడి 23,123.65 వద్ద ముగిసింది. రేపు బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో, ఇవాళ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఆరంభంలో ఆచితూచి సాగినప్పటికీ, చివరి సెషన్‌లో ఐటీ, మెటల్ రంగ షేర్లలో కొనుగోళ్ల జోరు పెరిగింది. దీంతో మార్కెట్లు లాభాలను నిలబెట్టుకున్నాయి. నిఫ్టీలో విప్రో, హిందాల్కో ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్ అత్యధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఈసారి కూడా ఆర్బీఐ రెపో రేటును యథాతథంగా ఉంచుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయినప్పటికీ, భవిష్యత్ విధానాలపై ఆర్బీఐ గవర్నర్ చేసే వ్యాఖ్యల కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ, మెటల్ సూచీలు రాణించాయి. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.20 శాతం స్వల్పంగా లాభపడగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.06% మేర నష్టపోయింది. నిఫ్టీకి 23,000 వద్ద తక్షణ మద్దతు ఉందని, 23,500-23,600 స్థాయి వద్ద నిరోధం ఎదురుకావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఎయిరిండియా ఇంధన సర్‌ఛార్జీ భారీగా పెంపు





న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా జెట్ ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో, దేశీయ-అంతర్జాతీయ మార్గాల్లో ఇంధన సర్‌ఛార్జీని సవరిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. దేశీయ మార్గాలకు సంబంధించి, బుధవారం నుంచి ఫ్లాట్ సర్‌ఛార్జీ స్థానంలో దూరం ఆధారిత విధానానికి మారనున్నట్లు ఆ విమానయాన సంస్థ తెలిపింది. దేశీయంగా 500 కిలోమీటర్ల లోపు ప్రయాణాలకు రూ.299 నుంచి 2,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ ప్రయాణాలకు రూ.899 సర్‌ఛార్జ్‌ను సవరిస్తున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు 24 డాలర్ల నుంచి 280 డాలర్ల వరకు వసూలు చేయనున్నట్లు తెలిపింది. సవరించిన ఛార్జీలు డొమెస్టిక్ ప్రయాణాలకు ఏప్రిల్ 8వ తేదీ నుంచి, అంతర్జాతీయ ప్రయాణాలకు 10వ తేదీ నుంచి వసూలు చేస్తామని తెలిపింది.

దేశీయ ప్రయాణాలకు 0 నుంచి 500 కిలోమీటర్ల వరకు రూ.299, 501 నుంచి 1000 కిలోమీటర్ల వరకు రూ.399, 1001 నుంచి 1500 కిలోమీటర్ల వరకు రూ.549, 1500 నుంచి 2000 కిలోమీటర్ల వరకు రూ.749, 2000 నుంచి అంతకుమించి కిలోమీటర్లకు రూ.899 వసూలు చేస్తారు. అంతర్జాతీయ ప్రయాణం విషయానికి వస్తే పశ్చిమాసియాకు 50 డాలర్లు, ఆగ్నేయాసియాకు 100 డాలర్లు, సింగపూర్‌కు 60 డాలర్లు, ఆఫ్రికాకు 130 డాలర్లు, యూకేకు 205 డాలర్లు, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు 280 డాలర్ల చొప్పున ఫ్యూయల్ సర్‌ఛార్జిని వసూలు చేయనున్నట్లు ఎయిరిండియా గ్రూప్ తెలిపింది.

## భారత సైన్యానికి వందలాది 'కమికాజే' డ్రోన్లు

న్యూఢిల్లీ: భారత సైన్యం తన ఆయుధ సామర్థ్యాన్ని అంతకంతకూ పెంచుకుంటోంది. తాజాగా, శత్రువుల గుండెల్లో నిద్రపోయేలా 'ఆత్మాహుతి డ్రోన్ల' (కమికాజే)ను తన అమ్ములపొదిలో చేర్చుకుంది. ఆధునిక యుద్ధ తంత్రాల్లో కీలక పాత్ర పోషించే ఈ డ్రోన్లను స్వదేశీ సంస్థ కేవలం రెండు నెలల వ్యవధిలోనే సైన్యానికి అందజేయడం విశేషం. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ' అనే సంస్థ సుమారు రూ. 10 కోట్ల ఒప్పందంలో భాగంగా వందలాది ఆత్మాహుతి డ్రోన్లను ఆర్మీ నార్తర్న్ కమాండ్‌కు అప్పగించింది. సరిహద్దుల్లో మారుతున్న భద్రతా సమీకరణాల దృష్ట్యా, ప్రాణనష్టం లేకుండా శత్రువులను తుదముట్టించేందుకు సైన్యం వీటిని అత్యవసరంగా సమకూర్చుకుంది. ఇవి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత గైడెన్స్‌తో లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తాయి. 10 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై ఇవి దాడులు చేయగలవు. గరిష్ఠంగా 2.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగురుతూ శత్రువుల కంట పడకుండా చొచ్చుకెళతాయి. ప్రతి డ్రోన్ సుమారు 2.5 కిలోల వరకు పేలుడు పదార్థాలను మోసుకెళ్లి, లక్ష్యాన్ని తాకిన వెంటనే పేలిపోతుంది. అందుకే వీటిని ఆత్మాహుతి డ్రోన్లు అంటారు. జీపీఎస్ సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో కూడా ఇవి పనిచేస్తాయి. మైనస్ 35 డిగ్రీల గడ్డకట్టే చలిలో కూడా ఇవి సమర్థవంతంగా దాడులు చేయగలవు. సాధారణ సైనికులు వెళ్లలేని కఠినమైన కొండ ప్రాంతాలు, అడవుల్లోకి చొచ్చుకెళ్లి శత్రువుల స్థావరాలను ధ్వంసం చేయడంలో ఇవి దిట్ట. భారత సరిహద్దుల రక్షణలో ఈ డ్రోన్లు ఒక 'గేమ్ చేంజర్'గా మారుతాయని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు. ఉగ్రవాద మూకలను ఏరిపారేయడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి.



కృతి సనన్

# అట్టహాసంగా విరోష్ రిసెప్షన్




**కొడగు పద్ధతిలో వధూవరుల ముస్తాబు**

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో క్రేజీ కపుల్ గా గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ , రష్మిక జంట గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాల తర్వాత ప్రేమలో పడ్డ ఈ జంట దాదాపు 8 సంవత్సరాల పాటు రహస్యంగా తమ బంధాన్ని కొనసాగించారు. అయితే మీడియా ఎప్పటికప్పుడు ఈ జంటను కనిపెడుతున్నా.. వీరు మాత్రం అధికారికంగా తమ బంధాన్ని రివీల్ చేయలేదు. ఇక ఏదో ఒక రోజు వీరే స్వయంగా ప్రకటిస్తారని అభిమానులు వీరికి "విరోష్" అంటూ ముద్దుగా పేరు కూడా పెట్టేశారు. వీరి పెళ్లి అధికారికంగా జరగబోతోందని వార్తలు వచ్చినా.. వీరు మాత్రం స్పందించలేదు. కానీ ఎట్టకేలకు ఫిబ్రవరి 22వ తేదీన అభిమానులు ప్రేమగా పెట్టిన విరోష్ అనే పదాన్ని స్వీకరిస్తూ "ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ తమ పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఇక అన్నట్టుగానే 2026 ఫిబ్రవరి 26న ఉదయపూర్ లోని ఒక ప్యాలెస్ లో 100 మంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఉదయం హిందూ సాంప్రదాయం ప్రకారం, సాయంత్రం కొడగు సాంప్రదాయం ప్రకారం రెండు పద్ధతుల్లో చాలా ఘనంగా వివాహం జరుపుకున్నారు. అటు పెళ్లితోనే కాదు వేసుకున్న దుస్తులతో.. ధరించిన జ్యూవెలరీతో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. అంతేకాదు తమ పెళ్లి వేడుకతో నేషనల్ వైడ్ క్రేజ్ ను సొంతం చేసుకున్నారు ఈ జంట. ఇక వివాహం అనంతరం సినీ సెలబ్రిటీల కోసం మార్చి 4వ తేదీన హైదరాబాద్ లోని తాజ్ హోటల్ లో ఘనంగా రిసెప్షన్ నిర్వహించారు. ఇక ఇందులో చాలా అందంగా ముస్తాబయి అందర్నీ ఆకట్టుకున్నారు. రిసెప్షన్ వేడుకలో తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు పలువురు సినీ సెలబ్రిటీలు సందడి చేసిన విషయం తెలిసిందే. ఇకపోతే వివాహం అనంతరం హనీమూన్ కి వెళ్ళొచ్చిన ఈ జంట ప్రస్తుతం రణబాలి సినిమా షూటింగ్లో బిజీగా ఉన్నారు. అయితే రష్మిక కొడగు సాంప్రదాయం ప్రకారం తమ బంధువుల కోసం మళ్లీ రిసెప్షన్ ను ఏర్పాటు చేశారు ఈ జంట. అసలు విషయంలోకి వెళ్తే.. రష్మిక పుట్టినరోజు సందర్భంగా ఇటీవల రష్మిక స్వస్థలమైన కర్ణాటకలోని ఇగ్గుతప్ప ఆలయాన్ని సందర్శించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే ఇప్పుడు ఈ జంట మరోసారి రిసెప్షన్ వేడుకను నిర్వహించారు. రష్మిక సొంత గ్రామమైన కూర్గ్ లో కొడగు సాంప్రదాయంలో రిసెప్షన్ జరుపుకున్నారు. ఇకపోతే రష్మిక కొడగు సాంప్రదాయ దుస్తుల్లో మెరిసింది. కూర్గి స్టైల్లో చీరను ధరించిన రష్మిక .. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రష్మిక – విజయ్ దేవరకొండ జంట ఈ దుస్తుల్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది అంటూ అభిమానులు సైతం కామెంట్లు చేస్తున్నారు. రెండవసారి రిసెప్షన్ జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.." నేను కొడగు రావడం ఇది మూడవసారి. మొదటిసారి రష్మికను కలవక ముందే నేను ఇక్కడికి వచ్చాను. గతంలో ఒకసారి వచ్చినప్పుడు నా ఫ్రెండ్ ఇంట్లో ఉన్నాను. అయితే నా ఫ్రెండ్ ఈ రిసెప్షన్ కి హాజరు కాలేదు. నా స్కూల్ టైం లో స్నేహితులతో కలిసి ఇక్కడికి వచ్చాను. కొడగు అందాలు నాకు చాలా ఇష్టం . ఇక్కడి మహిళలు కూడా అంతే అందంగా ఉంటారు.



## నేడు రేసుగుర్రం రీరిలీజ్

12ఏండ్ల క్రితం విడుదలైన అల్లు అర్జున్ 'రేసుగుర్రం' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో నల్లమలుపు శ్రీనివాస్(బుజ్జి), వెంకటేశ్వరరావు కలిసి నిర్మించిన ఈ చిత్రం బుధవారం అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నది. క్రౌన్ మూవీస్ ఈ చిత్రాన్ని రెండు తెలుగురాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్మాతలు నల్లమలుపు శ్రీనివాస్, డా.వెంకటేశ్వరరావు, నటులు, అలీ, రఘుబాబు, పంపిణీదారులు నారాయణరావు, సుబ్బారావు హాజరయ్యారు.




## శ్రేయా ఘోషల్ కొత్తిల్లు.. 30 కోట్లు

ప్రఖ్యాత గాయని శ్రేయా ఘోషల్ ఈసారి పాటతో కాకుండా ముంబై నగరంలో కొనుగోలు చేసిన అత్యంత విలాసవంతమైన ఆస్తితో అందరి దృష్టిని ఆకర్షించారు. ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటిగా పేరుగాంచిన వర్లీ లో ఆమె ప్రీమియం అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసారు. శ్రేయా ఘోషల్ ఈ కొత్త ఇంటి కోసం ఏకంగా30 కోట్లు వెచ్చించారు. వర్లీలోని ప్రతిష్టాత్మకమైన హై-రైజ్ టవర్‌లో ఈ ఫ్లాట్ ఉంది. 3169 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ అపార్ట్‌మెంట్ కలదు. ఈ ఫ్లాట్ ఆధునిక వసతులతో కూడిన రాజభవనాన్ని తలపిస్తోంది. కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ఇప్పటికే పూర్తయింది. ఈ డీల్ కోసం శ్రేయా ఘోషల్ భారీ మొత్తంలో స్టాంప్ డ్యూటీని చెల్లించారు. దాదాపు 1.8 కోట్లు ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేసి ఈ ఆస్తిని తన పేరిట రిజిస్టర్ చేయించుకున్నారు.



## 'జైలర్ 2'లో నలుగురు సూపర్ స్టార్స్



సినిమా ఇండస్ట్రీలో అప్పుడప్పుడే కనిపించే అద్భుత కాంబినేషన్లలో ఒకటిగా 'జైలర్ 2' నిలవబోతోంది. ఒకే సినిమాలో నలుగురు సూపర్ స్టార్స్ కలిసి నటించబోతున్నారన్న వార్త సినీ వర్గాల్లో భారీ చర్చకు దారితీస్తోంది. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, ఇప్పటికే ఘన విజయాన్ని అందుకున్న జైలర్‌కి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో రజనీకాంత్ నటనతో పాటు శివ రాజ్ కుమార్ ప్రత్యేక పాత్ర సినిమాకు అదనపు హైప్ తెచ్చింది. ఈ సీక్వెల్‌లో రజనీకాంత్‌తో పాటు మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ , బాలీవుడ్ స్టార్ షారూఖ్ ఖాన్ , కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కలిసి కనిపించనున్నట్లు సమాచారం. ఈ స్థాయి కాంబినేషన్ ఒకే సినిమాలో రావడం చాలా అరుదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ జోరుగా సాగుతోంది. ముఖ్యంగా షారుఖ్ ఖాన్ ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారని, ఆయనకు సంబంధించిన కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే మోహన్‌లాల్‌పై కూడా కీలక సీన్స్ పూర్తి చేశారు. 'జైలర్ 2'ను హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. నలుగురు సూపర్ స్టార్స్ ఉండటంతో భారీ యాక్షన్ సన్నివేశాలు, మాస్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందించనున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

## లాయర్ కాదు.. నువ్వే రావాలి!

నోరా ఫతేహీపై మహిళా కమిషన్ సీరియస్

కన్నడ చిత్రం -కేడీ - ది డెవిల్-లో నోరా ఫతేహి, సంజయ్ దత్ నటించిన -సర్సే నిన్న సెరగా సర్సే- పాటపై తలెత్తిన వివాదం జాతీయ స్థాయికి చేరింది. ఈ పాటలోని అశ్లీల సాహిత్యం, అసభ్యకర దృశ్యాల పట్ల సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమైన తీవ్ర నిరసనలను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యూ) సుమోటోగా స్వీకరించింది. సృజనాత్మకత పేరుతో మహిళల హుందాతనాన్ని దెబ్బతీయడం సహించరానిదని కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ స్పష్టం చేస్తూ.. చిత్ర బృందానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే ఈ వివాదాస్పద గీతాన్ని యూట్యూబ్ నుండి తొలగించినా.. ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలకు కమిషన్ ఉపక్రమించింది.





## నేడు అల్లు-అట్లీ టైటిల్ రివీల్!

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ ఇప్పుడు దేశ సరిహద్దులు దాటేసింది. 'పుష్ప' సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన బన్నీ, ఇప్పుడు తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ ఇవ్వనున్నారు. కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీతో బన్నీ చేయబోయే సినిమాపై సోషల్ మీడియాలో భారీ ఎత్తున హైప్ నడుస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్ నుంచి ఒక స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయడంతో సోషల్ మీడియా మొత్తం బన్నీ నామస్మరణతో మారుమోగిపోతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ క్వీన్ దీపికా పదుకొణే హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఒక హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది. ఇక 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లో వెయ్యి కోట్లు కొల్లగొట్టిన అట్లీ, ఇప్పుడు బన్నీతో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారా అని యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఈ చిత్రంలో భారీ వీఎఫ్ఎక్స్ వర్క్, అట్లీ మార్క్ మాస్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉండబోతున్నాయని సమాచారం. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా టైటిల్ మరియు గ్లింప్స్ అనౌన్స్‌మెంట్‌కు ముహూర్తం ఖరారైంది. ఇక ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఈ సినిమా పేరును అధికారికంగా ప్రకటించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ సినిమాపై అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లింది. ముఖ్యంగా ఈ చిత్రానికి కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండటం మరో విశేషం. యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ బన్నీకి ఎలాంటి మాస్ బీట్స్ ఇస్తారో చూడాలని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు.



## పిల్లల్ని కూడా కన్నా: త్రిష

త్రిష ఇకపై సినిమాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నారని, కొంతమంది నిర్మాతలు తనకు ఈ విషయాన్ని వెల్లడించారని ప్రముఖ సినీ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్ట్ చిత్ర లక్ష్మణన్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై స్పందించిన త్రిష..అవును నేను సినిమాలు మానేసి ఒక పెద్ద వ్యాపార వేత్తని వివాహం చేసుకొని, నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఆలోచనలకి ఈ సమాధానం సరిపోతుందా? మీరు వార్తలు రాయడానికి ఇది సరిపోతుందా? లేక ఇంకేదైన స్టఫ్ కావాలా? అంటూ త్రిష గట్టిగా కౌంటర్ ఇచ్చింది.







# రాజస్థాన్.. రోర్!

## వరుసగా హ్యాట్రిక్ విజయాలు

### జైస్వాల్, వైభవ్ ఊచకోత.. తేలిపోయిన ముంబై బ్యాటర్లు

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తమ జోరును కొనసాగుతోంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది. ముంబై ఇండియన్స్‌తో మంగళవారం గౌహతి వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన రాజస్థాన్ రాస్థాన్ రాయల్స్ 27 పరుగుల తేడాతో గెలుపొందింది.

**యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ ఊచకోతతో మ్యాచ్‌ను ఏకపక్షం చేయగా.. రవి బిష్ణోయ్, బర్గర్, ఆర్చర్ విజయలాంఛనాన్ని పూర్తి చేశారు. వర్షం అంతరాయంతో ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌ను అంపైర్లకు 11 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 11 ఓవర్లలో 3 వికెట్లకు 150 పరుగుల భారీ స్కోర్ చేసింది.**

యశస్వి జైస్వాల్(32 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 77 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగగా.. వైభవ్ సూర్యవంశీ(14 బంతుల్లో ఫోర్, 5 సిక్స్‌లతో 39) సిక్సర్ల మోత మోగించాడు. ధ్రువ్ జురెల్(2) విఫలమైనా.. కెప్టెన్ రియాన్ పరాగ్(10 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 20) దూకుడుగా ఆడాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అల్లా మొహమ్మద్ గజన్‌ఫర్(2/21) రెండు వికెట్లు తీయగా.. శార్దూల్ ఠాకూర్ ఒక వికెట్ పడగొట్టాడు. వైభవ్ సూర్యవంశీ ధాటికి జస్ప్రీత్ బుమ్రా కూడా ఈ మ్యాచ్‌లో తేలిపోయాడు. 3 ఓవర్లలో 32 పరుగులు సమర్పించుకొని ఒక్క వికెట్ తీయలేకపోయాడు. అనంతరం ముంబై ఇండియన్స్ 11 ఓవర్లలో 6 వికెట్లకు 123 పరుగులే చేసి ఓటమిపాలైంది. షెర్ఫన్ రూథర్‌ఫోర్డ్(8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 25), నమన్ ధీర్(13 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25) టాప్ స్కోరర్లుగా నిలవగా.. ర్యాన్ రికెల్టన్(8), రోహిత్ శర్మ(5), సూర్యకుమార్ యాదవ్(6), తిలక్ వర్మ(14), హార్దిక్ పాండ్యా(9), శార్దూల్ ఠాకూర్(8) తీవ్రంగా నిరాశపర్చారు.

రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో రవి బిష్ణోయ్, నండ్రే బర్గర్, సందీప్ శర్మ రెండేసి వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే ఒక వికెట్ తీసాడు. వర్షం కారణంగా పిచ్‌పై కవర్లు కప్పి ఉంచడంతో వికెట్ బౌలింగ్‌కు అనుకూలిస్తుందని అంతా అనుకున్నారు. కానీ రాజస్థాన్ ఓపెనర్లు తొలి బంతి నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. దీపక్ చాహర్ వేసిన తొలి ఓవర్‌లోనే ఓ సిక్సర్‌తో పాటు నాలుగు బౌండరీలు బాదిన యశస్వి జైస్వాల్ 22 పరుగులు పిండుకున్నాడు. వైభవ్ సూర్యవంశీ.. బుమ్రా బౌలింగ్‌లో ఎదుర్కొన్న మూడు బంతుల్లో 2 సిక్స్‌లు బాదాడు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 30 బంతుల్లో 80 పరుగులు జోడించి మ్యాచ్‌ను ముంబై నుంచి లాగేసుకున్నారు. వైభవ్ ఔటైనా.. యశస్వి జైస్వాల్ ఆఖరి వరకు క్రీజులో ఉండి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. యశస్వి-వైభవ్ దూకుడైన ఓపెనింగ్ భాగస్వామ్యం ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.



## వైభవ్ బ్యాటింగ్‌కు పిచ్చోడినయ్యా: హార్దిక్

రాజస్థాన్ రాయల్స్ సిక్సర పిడుగు వైభవ్ సూర్యవంశీపై ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ప్రశంసల జల్లు కురిపించాడు. 15 ఏళ్ల వయసులోనే అతను ఆడుతున్న ఫియర్‌లెస్ గేమ్ చూసి పిచ్చోడినయ్యానని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గౌహతి వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 27 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన హార్దిక్ పాండ్యా.. తమ ఓటమికి చెత్త బౌలింగే కారణమని అంగీకరించాడు. పవర్ ప్లేలో ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయాలేకపోయామని తెలిపాడు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పిన హార్దిక్.. భవిష్యత్తులో అతను ఇంతకంటే మెరుగ్గా రాణించాలని ఆకాంక్షించాడు. 'మా బౌలింగ్ వైఫల్యమే ఓటమికి కారణం. బ్యాటింగ్ ఏ మాత్రం కాదు. ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయలేకపోయాం. రాజస్థాన్ రాయల్స్ అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. ఈ ఓటమికి మా బౌలర్లు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. బౌలింగ్ యూనిట్‌గా మేం ఆశించిన స్థాయిలో రాణించలేదు. కానీ రాజస్థాన్ మాత్రం అద్భుతమైన క్రికెట్ ఆడింది. ఈ ఓటమికి బ్యాటింగ్ ఏ మాత్రం కారణం కాదు. ఈ ఓటమికి ఖచ్చితంగా మా బౌలింగ్ విభాగమే బాధ్యత వహించాలి. టీ20 క్రికెట్‌లో రెండు బంతులతో ఫలితం మారిపోతుంది. 27 పరుగుల తేడాతో ఓడిపోయామంటే.. ఐదు బంతులు మంచిగా వేయాల్సింది. అలా వేసి ఉంటే ఐదు సిక్సర్లు వచ్చేవి కావు. మేం సరైన బంతులు వేసి ఉంటే కచ్చితంగా ఈ మ్యాచ్ గెలిచేవాళ్లం. కానీ రాజస్థాన్ ఓపెనర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఆ తర్వాత మేం ఎంత ప్రయత్నించినా విజయం దక్కలేదు. 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ నిర్భయంగా ఆడటం చూసి షాకయ్యాను. ఈ మ్యాచ్‌కు సిద్ధమయ్యేటప్పుడు అతని గురించి మేం మాట్లాడుకున్నాం. అతను బ్యాటింగ్ చేసినా విధానం.. ఫియర్‌లెస్ గేమ్, షాట్ సెలెక్షన్ అద్భుతం.. అమోఘం. భవిష్యత్తులో అతను ఇంకా మెరుగ్గా రాణించాలని కోరుకుంటున్నాను. ఈ మ్యాచ్‌లో చేసిన తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకొని తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతాం. రేపు ఉదయం సూర్యుడు ఉదయించినట్లే మేం కూడా పుంజుకుంటాం. మా తప్పులను సరిదిద్దుకొని ఆర్‌సీబీతో తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతాం.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.



## చెన్నై హెడ్ కోచ్‌గా ఫ్లెమింగ్ గుడ్‌బై?

చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు స్టీఫెన్ ఫ్లెమింగ్ సుదీర్ఘ ప్రయాణం ముగింపు దశకు చేరుకుందా? అనే చర్చ క్రీడా వర్గాల్లో జోరందుకుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో స్టీఫెన్ ఫ్లెమింగ్ ఒకరు. 2008లో ఆటగాడిగా ప్రయాణం మొదలుపెట్టిన ఫ్లెమింగ్, 2009 నుంచి కోచ్‌గా బాధ్యతలు చేపట్టి చెన్నై సూపర్ కింగ్స్‌ను ఏకంగా 10 సార్లు ఫైనల్స్‌కు చేర్చారు. మధ్యలో రెండేళ్లు పూణే జట్టుకు కోచ్‌గా ఉన్నా, సీఎస్‌కే అంటే ఫ్లెమింగ్.. ఫ్లెమింగ్ అంటే సీఎస్‌కే అనేంతగా ఆ జట్టులో మమేకమైపోయారు. అయితే, ప్రస్తుతం సీఎస్‌కే శిబిరంలో పరిస్థితులు మారినట్లు కనిపిస్తున్నాయి. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. సీఎస్కే కు పెట్టని కోటగా ఉన్న 'చేపాక్' మైదానంలో పిచ్ స్వభావం మారడం జట్టుకు పెద్ద మైనస్‌గా మారిందని వాన్ విశ్లేషించారు. గతంలో స్పిన్నర్లకు అనుకూలించే ఈ పిచ్, ఇప్పుడు పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది. ఇది సీఎస్‌కే బౌలర్లకు పెద్ద సవాలుగా పరిణమించింది. ప్రత్యర్థి జట్లు భారీ స్కోర్లు సాధిస్తుండటంతో, హోమ్ గ్రౌండ్‌లో సీఎస్‌కే ఆధిపత్యం తగ్గుతోందనే వాదన వినిపిస్తోంది. గత 16 ఏళ్లుగా జట్టును వెనకుండి నడిపిస్తున్న ఫ్లెమింగ్, ఈ సీజన్‌లో జట్టును తిరిగి ఫామ్‌లోకి తీసుకురాకపోతే ఆయన పదవికి ముప్పు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇక మెన్ ఇన్ ఎల్లో జట్టు వరుస ఓటములు కూడా ఫ్లెమింగ్‌పై ఒత్తిడి పెంచుతోంది. మరోవైపు ధోనీ జట్టులో లేకపోవడం మరింత కలవరపెడుతోంది.జట్టులో కొత్త రక్తం, కొత్త వ్యూహాలు అవసరమని మేనేజ్‌మెంట్ భావిస్తే, ఫ్లెమింగ్ సుదీర్ఘ ప్రయాణానికి ఈ ఏడాది ఫుల్ స్టాప్ పడే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో సీఎస్‌కే ప్లే ఆఫ్స్ చేరకపోతే,వచ్చే ఏడాది కొత్త కోచ్‌తో బరిలోకి దిగే ఛాన్స్ ఉందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ధోనీ-ఫ్లెమింగ్ జోడీ ఐపీఎల్‌లో ఒక అద్భుతమైన అధ్యాయం. అయితే కాలంతో పాటు మార్పులు సహజం. ఈ కీలక సీజన్‌లో ఫ్లెమింగ్ తన మార్క్ వ్యూహాలతో జట్టును మళ్ళీ టాప్‌లోకి తీసుకువస్తారా? లేక విమర్శకులు అన్నట్లుగా ఒక గొప్ప ప్రయాణానికి ఘనమైన వీడ్కోలు పలుకుతారా? అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, సీఎస్‌కే చరిత్రలో ఫ్లెమింగ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

## బాబ్బాబు.. తప్పైంది!

### బీసీసీఐతో కాళ్ల బేరానికి బంగ్లాదేశ్

భారత్ క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)తో సంబంధాలను మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు చేపట్టింది. భారత్‌కు వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) చీఫ్ అమీనుల్ బల్బుల్‌పై వేటు వేసింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆడేందుకు భారత్‌కు వెళ్లమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని అప్పట్లో అమీనుల్ బల్బుల్ డిమాండ్ చేశాడు. పాకిస్థాన్ మాటలు పట్టుకొని టోర్నీ నుంచి తప్పుకున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని తప్పుబట్టిన బంగ్లాదేశ్ నయా ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకుంది. బోర్డు కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేసి బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలో 11 మంది సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బీసీబీలో తదుపరి ఎన్నికలు జరిగే వరకు ఈ కమిటీ బాధ్యతలు నిర్వహిస్తుందని పేర్కొంది. తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలోని ఈ బోర్డులో రష్నా ఇమామ్, మీర్జా యాసిర్ అబ్బార్, సయ్యద్ ఇబ్రహీం అహ్మద్, ఇస్రాఫిల్ ఖోస్రూ, మిన్హాజుల్ అబెడిన్ నాన్నూ, అథర్ అలీ ఖాన్‌లు ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో జాతీయ ఎన్నికల జరగ్గా.. కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. అంతకుముందు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంది. భారత్‌పై అక్కసుతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ టోర్నీని బహిష్కరించింది. ఐపీఎల్ 2026 సీజన్ నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించాలని కేకేఆర్ టీమ్‌ను బీసీసీఐ ఆదేశించడంతో వివాదం మొదలైంది. ఈ నిర్ణయంపై ఆగ్రహించిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌లో పర్యటించకూడదని నిర్ణయించుకుంది. అయితే కొత్త క్రీడా మంత్రి అమీనుల్ హక్ ఐసీసీతో సంప్రదింపులు జరిపి బోర్డు నాయకత్వంలో మార్పులు ఉంటాయని సూచించారు. దేశంలో ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల ప్రసారంపై ఉన్న నిషేధాన్ని తొలగించింది. గతంలో టీ20 ప్రపంచకప్ విషయంలో బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన తమీమ్ ఇక్బాల్‌కు బోర్డు బాధ్యతలు అప్పగించింది. గతంలో తమీమ్ ఇక్బాల్ భారత్‌కు అనుకూలంగా మాట్లాడారని బీసీబీ డైరెక్టర్ ఎం. నజ్ముల్ ఇస్లాం ఆయన్ని "ఇండియన్ ఏజెంట్" అని విమర్శించడం పెద్ద వివాదానికి దారితీసింది. ఆ తర్వాత నజ్ముల్‌ను పదవి నుంచి తొలగించారు.

#### బంగ్లాదేశ్ పర్యటనకు భారత్?

రాబోయే కాలంలో మూడు వన్డేలు, టీ20 సిరీస్ కోసం భారత జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతేడాది రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత జట్టు పర్యటన వాయిదా పడింది. అలాగే బంగ్లాదేశ్ మహిళల జట్టు భారత పర్యటన కూడా రద్దయింది. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు మెరుగవుతుండటంతో తిరిగి క్రికెట్ సంబంధాలు కూడా మొదలవ్వనున్నాయి.

## సిడ్నీలో డేవిడ్ వార్నర్ అరెస్ట్



ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్న్‌ను సిడ్నీ పోలీసులు అరెస్టు చేశారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మీడియాలో కథనాలు వచ్చాయి. మారుబ్రాలో పోలీసులు రోడ్డుపై బ్రీత్ టెస్టింగ్‌ను నిర్వహిస్తుండటం చూసిన వార్నర్ తన కారును రోడ్డు పక్కన పార్కు చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడికి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు చేయగా పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలింది. అతని రక్తంలో అల్కాహాల్ స్థాయి 0.104గా నమోదైంది. ఆస్ట్రేలియాలోని నిబంధనల ప్రకారం అతను పరిమితి కంటే రెట్టింపు మద్యం సేవించాడు. దీనితో మారుబ్రా పోలీసు అధికారులు వార్నర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి, అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి వార్నర్ వచ్చే నెలలో కోర్టు ఎదుట హాజరు కావాల్సి ఉంటుంది.

## రహానే.. ఇదే తగ్గించుకో: సెహ్వాగ్





కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ అజింక్యా రహానేపై టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. విమర్శలకు ఘాటుగా స్పందించాల్సిన అవసరం లేదని, ఆటతోనే బదులివ్వవచ్చని చురకలు అంటించాడు. దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, బిగ్ బీ అమితా బచ్చన్ వంటి వాళ్లే విమర్శలకు వారి పనితీరుతో సమాధానమిచ్చారని గుర్తు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కేకేఆర్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడంతో కెప్టెన్ రహానేపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా అతని స్ట్రైక్‌రేట్ లేదని కొందరు విశ్లేషకులు మండిపడ్డారు. అయితే ఈ విమర్శలపై రహానే ఘాటుగా స్పందించాడు. ఏదో ఎజెండాతో తనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని బదులిచ్చాడు. అంతేకాకుండా ముంబై ఇండియన్స్‌తో పరాజయం అనంతరం కామెరూన్ గ్రీన్ బౌలింగ్ చేయకపోవడానికి కారణం అడగ్గా.. క్రికెట్ ఆస్ట్రేలియాను అడగాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. తాజాగా అజింక్యా రహానే శైలిని తప్పుబట్టిన సెహ్వాగ్.. తనదైన శైలిలో మందలించాడు. 'ఆటగాళ్లు ఇలాంటి అనవసర వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం లేదు. అజింక్యా రహానె కెప్టెన్ కాబట్టి.. కామెరూన్ గ్రీన్ గురించి అడిగారు. అతని దగ్గర సమాధానం లేకపోవడంతో క్రికెట్ ఆస్ట్రేలియాను అడగమని చెప్పాడు. ఆట విషయంలో విమర్శలు, పొగడ్తలు రెండూ వస్తాయి. అన్నింటికి తటస్థంగా ఉండాలి. ఇలాంటి అనవసర వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం లేదు. సచిన్ టెండూల్కర్, అమితాబ్ బచ్చన్ వంటి వారు తమపై వచ్చిన విమర్శలను హుందాగా ఎదుర్కొన్నారు. చాలా సందర్భాల్లో వారు మౌనంగా ఉంటూ పనితీరుతోనే బదులిచ్చారు. ఇక సచిన్ పాజీ అయితే ఆటగాళ్లందరికి ఈ విషయంలో గొప్ప ఉదాహరణగా నిలుస్తారు. ఒకానొక సమయంలో టెండూల్కర్ ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడ్డాడు. ఒక వార్తాపత్రిక 'ఎండూల్కర్' అనే హెడ్డింగ్‌తో ఆర్టికల్ రాసింది. కానీ సచిన్ పాజీ తన ఆటతోనే సమాధానం ఇచ్చాడు. కాబట్టి.. ఆటగాళ్లు విమర్శలకు స్పందించకుండా మౌనంగా ముందుకు వెళ్లడమే మంచిదని నా అభిప్రాయం. రహానే ఒక సెంచరీ చేస్తే.. అందరి నోర్లు మూతపడతాయి. అన్నింటికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు' అని సెహ్వాగ్ చురుకలంటించాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 8-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## పనికిరాని ముచ్చట

రాజకీయాల్లో విమర్శలు సహజం. కానీ, బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి హోదాలో ఉన్న ఇద్దరు నాయకులు, సినిమా డైలాగులతో వీధి రౌడీల తరహాలో సవాళ్లు విసురుకోవడం ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం శోభనివ్వదు. ప్రస్తుతం కేరళ ఎన్నికల వేళ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ సీఎం పినరయి విజయన్‌ల మధ్య నడుస్తున్న మాటల యుద్ధం చూస్తుంటే.. ఇది ప్రజల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న చర్చలా కాకుండా, కేవలం ఆధిపత్యం కోసం ఆడుతున్న 'పనికిరాని ముచ్చట'గానే కనిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థిని చిత్తు చేయాలన్న తపన ఉండొచ్చు. కానీ, దానికి నీ పో మోనే విజయ (నువ్వు వెళ్ళిపో బిడ్డా విజయన్) అంటూ మోహన్‌లాల్ సినిమా డైలాగులు వాడటం సీఎం స్థాయికి తగని పని. దీనికి ప్రతిగా, 78 ఏళ్ల వయసున్న, ఎంతో అనుభవం ఉన్న పినరయి విజయన్ కూడా సంయమనం కోల్పోయి డ్యాష్ మోనే రేవంత్ అంటూ పరోక్షంగా బూతు పదాన్ని ధ్వనించేలా మాట్లాడటం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. ఇద్దరు ముఖ్యమంత్రులు ఇలా 'మాస్ డైలాగుల'తో చప్పట్లు కొట్టించుకోవాలను కోవడం పరిపాలనా దక్షత అనిపించుకోదు. ఇక ఈ గొడవలో అభివృద్ధి సూచీల ప్రస్తావన మరో ప్రహసనం. "మా దగ్గర పేదరికం లేదు, మీది అవినీతిలో ఆరో స్థానం" అని విజయన్ అంటే, "మీ దగ్గర ఉపాధి లేక జనం వలసలు పోతున్నారు" అని రేవంత్ కౌంటర్ ఇవ్వడం.. 'నీ చొక్కా కంటే నా చొక్కా తెల్లన' అని వాదించుకున్నట్లుంది. నిజానికి ఇద్దరి పాలనలోనూ లోపాలు ఉన్నాయి. కేరళలో నిరుద్యోగం, తెలంగాణలో అమలు కాని హామీలు.. ఇలా ఎవరి సమస్యలు వారికి ఉన్నాయి. వాటిని సరిదిద్దడం మానేసి, పొరుగు రాష్ట్రంపై నిందలు వేయడం వల్ల ఆయా రాష్ట్రాల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమిలో మిత్రపక్షాలు గా ఉంటూ, కేరళ గడ్డపై మాత్రం బద్ధ శత్రువుల్లా ఇలా వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోంది. ఈ రచ్చ అంతా ఎన్నికల ప్రచారంలో మైకుల ముందు హడావిడి కోసమే తప్ప, దీనివల్ల తెలంగాణకు కానీ, కేరళకు కానీ దక్కే ప్రయోజనం శూన్యం. చివరగా, పరిపాలన అనేది డైలాగ్ డెలివరీ కాదు. ప్రజలు కోరుకుంటున్నది సినిమాటిక్ పంచ్‌లు కాదు, తమ బతుకులు మార్చే నిర్ణయాలు. ఈ విషయాన్ని ఇద్దరు సీఎంలు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. లేదంటే ఈ వ్యవహారం అంతా చరిత్రలో ఒక 'పనికిరాని ముచ్చట'గానే మిగిలిపోతుంది.

# భూములు కొనేప్పుడు జాగ్రత్త!





**ఏజే కరణ్ లాల్**
అడ్వొకేట్, 9492557496
advocateajkl@gmail.com

ప్రతి వ్యక్తి తాను ఎంతో కష్టపడి ఎన్నెన్నో ప్రయాసలను ఎదుర్కొని పైసా పైసా కూడబెట్టి ఒక స్థిరాస్తి పైన పెట్టుబడి పెట్టాలనుకొంటాడు. అట్టి స్థిరాస్తి తాను ఎంతో ఇష్టపడే తన వారు అనుభవించాలి అనుకుంటాడు లేదా తన పదవీ విరమణ అనంతరం వ్యవసాయము చేస్తూ జీవనం కొనసాగించాలనుకొంటాడు లేదా పెట్టిన పెట్టుబడి పైన తగిన లాభాలు ఆర్జించాలి అనుకొంటాడు. కానీ సరైన అవగాహన లేకుండా పెట్టుబడి పెట్టినచో పెట్టిన పెట్టుబడి మొత్తము వృధా అయ్యే అవకాశం ఉంటుంది. ఇది సంవత్సరాల తరబడి కొనసాగే కోర్టు వ్యాజ్యాలకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడి పెట్టే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో శ్రేయస్కరము.

స్థిరాస్తి పెట్టుబడులలో భూమి కొనుగోలు ఒకటి. భూమి పైన పెట్టుబడి ఎప్పటికైనా లాభదాయకమే. కానీ ఎలాంటి భూమి కొనాలి అనేది చాలా ముఖ్యమైనది. ఈ విషయం పైన చాలా మందికి అవగాహన కూడా ఉండదు. భూములు నానా రకాలుగా ఉంటాయి. అందులో వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు అని రెండు రకాలు. అది వ్యవసాయ భూమి అయినా లేక వ్యవసాయేతర భూమి అయినా ఇందులో పెట్టుబడి పెట్ట తగిన భూములు, పెట్టుబడి పెట్టకూడని భూములు అని మళ్ళీ రెండు రకాలు. పెట్టుబడి పెట్ట దగిన భూములలో వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూములు ఉంటాయి. వ్యవసాయ భూములు వ్యవసాయ నిమిత్తము, పంట పండించే నిమిత్తము తీసుకునే భూములు. ఇలాంటి వ్యవసాయ భూములు ఒక వ్యక్తి నుండి ఇంకొక వ్యక్తి ద్వారా పెట్టుబడి పెట్టి కొనినవి అయి ఉండవచ్చు. లేదా వంశ పారంపర్యముగా ఒకరి నుండి మరొకరికి ఆస్తి బదిలీ ద్వారా హక్కులు పొందినవి అయి ఉండవచ్చు. వ్యవసాయ భూములలో పట్టా భూములు ఎంతో ముఖ్యమైనవి. పట్టా భూములు కూడా వివిధ రకాలుగా ఉంటాయి. కానీ ప్రతి పట్టా భూమి పెట్టుబడి పెట్ట తగిన భూమి కాదు. మనం కొంటున్న భూమి హక్కుదారులు పట్టాలను కలిగి ఉండవచ్చు., వారి పేర్లు 'భూ భారతి' ఆన్లైన్ పోర్టల్ యందు పేర్లు కలిగి ఉండి 'పట్టాదారు పాస్ పుస్తకము' కూడా కలిగి ఉండవచ్చు. 'భూ భారతి' అనేది తెలంగాణ ప్రభుత్వము రెవెన్యూ శాఖ వారి భూమి రికార్డుల అధికార వెబ్ సైట్. అయినా సరే ఆ భూములను మనము పెట్టుబడి పెట్టదగిన భూములు అని అనలేము. ఇది చాలా మందికి ఆశ్చర్యము కలిగించవచ్చు. కానీ ఇది వాస్తవం.

పట్టా భూములలో సాధారణ వ్యవసాయ పట్టా భూములతో పాటుగా ఇతర పట్టా భూములు కూడా ఉంటాయి. సాధారణ వ్యవసాయ పట్టా భూములను అట్టి వ్యవసాయ పట్టాదారుల హక్కులను పరీక్షించుకుని పెట్టుబడి పెట్టవచ్చు. ఇలాంటి భూముల కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ పట్టాలు ఉండి కూడా పెట్టుబడి పెట్ట కూడని భూములు ఉంటాయి. అలాంటి భూములలో ఇనామ్ భూములు, అసైన్మెంట్ భూములు, ఈద్గా భూములు, దస్తు గర్దన్ భూములు, గ్రామ కంఠం భూములు, లావణి పట్టా భూములు, డి-ఫామ్ భూములు, డి. కె. టి. భూములుమొదలగునవి ఎన్నో ఉన్నాయి. వీటిలో ఇనామ్ భూములు, అసైన్మెంట్ భూములు పట్టాలను కలిగి ఉంటాయి. పట్టాలు ఉన్నాయి కదా అని వీటిని కొనుటకు వీలు లేదు.

అసైన్మెంట్ భూములు ప్రభుత్వము వారు భూమి లేని నిరుపేద రైతులకు భృతిని కల్పించి వారికి వ్యవసాయము ద్వారా జీవనోపాధిని, ఉద్యోగమును కల్పించి ఆదాయ మార్గములను ఏర్పాటు చేసే నిమిత్తము భూమిని పంచి అట్టి భూములకు పట్టాలను ఇచ్చి గుర్తింపు ఇచ్చినవి. ఇట్టి భూములు పట్టాలను కలిగి ఉంటాయి. ఇట్టి భూములుపట్టాలను కలిగి ఉన్ననూ అవి ఏనాటికైనను, ఎప్పటికైననూ ప్రభుత్వ భూములే. 9/77 చట్టము ద్వారా లేదా ఆంధ్ర ప్రదేశ్ అసైన్ భూములు (బదిలీ నిషేధం) చట్టం, 1977, తెలంగాణ అసైన్ భూములు (బదిలీ నిషేధం) చట్టం, 1977 అను చట్టాల ద్వారా ప్రభుత్వం అసైన్ భూములను నియంత్రిస్తుంది.. ఇట్టి ప్రభుత్వ భూములను కొనడానికి గానీ అమ్మడానికి గానీ వీలు లేదు. ఒకవేళ తెలిసి గానీ తెలియక గానీ ఇలాంటి భూములను అమ్మిననూ, లేదా కొన్ననూ అట్టి భూములపైన ఎప్పటికైనను ప్రభుత్వానికే సంపూర్ణ హక్కులు కలిగి ఉంటాయి. కాబట్టి అసైన్ భూములను కొనకూడదు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వము, అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వములు భూ సంస్కరణలను తీసుకు వచ్చాయి. 1975 ఆంధ్ర ప్రదేశ్ భూ సంస్కరణల చట్టము ప్రకారము ప్రతి మనిషికి, ప్రతి కుటుంబానికి ఉండవలసిన గరిష్ట భూ పరిమితిని విధించింది. దీని ప్రకారము పరిమితిని మించి భూమి ఉన్న వారి నుండి ప్రభుత్వము భూమిని స్వాధీనము చేసుకుని అందులో కొంత భూమిని అప్పట్లో భూమి లేని నిరుపేదలకు పంచి పెట్టింది. ఇట్టి భూమిని ఇనామ్ భూమి అన్నారు. ఇనామ్ భూములు అనేవి ఎలాంటి హక్కు లేని భూములు. ఇనామ్ భూములకు పట్టాలు ఉంటాయి. ఇనామ్ భూముల పట్టాలు ఇనామ్ హక్కుదారుల నుండి వారి వంశము వారికి బదిలీ అవుతాయి. కానీ వారికి సంపూర్ణ హక్కులు ఉండవు. కావున ఇనామ్ భూములు ప్రభుత్వ భూములే. ప్రభుత్వము ఇనామ్ భూములను ఎప్పుడైనా స్వాధీనము చేసుకునే హక్కును కలిగి ఉంటాయి. కాబట్టి ఇనామ్ భూములను కొనకూడదు.

అలయాగే వక్ఫు భూములు లాంటి ముస్లిం సంస్థల ఆధీనములో ఉన్న భూములు,, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనములో ఉన్నటువంటి భూములు, ఎలాంటి ధర్మ సంస్థల ఆధీనములో ఉన్నటువంటి భూములను కూడా కొనకూడదు. అలాగే వ్యవసాయేతర భూముల పెట్టుబడులలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలసి ఉంటుంది. వ్యవసాయేతర భూములు వివిధ రకాల ఉద్దేశ్యముతో కుడినవి ఉండవచ్చు. అనగా ఇళ్ళు. ఆఫీసులు, ఫాక్టరీలు, గోదాములు, మొదలగునవి ఎన్నో రకములుగా ఉండవచ్చు. ఇళ్ళు నిర్మించుటకు, వాటి లేఔట్ నిర్మాణాల నిమిత్తము, ఆఫీసులు, కార్యాలయాల మిమిత్తము, ఫాక్టరీలు లేదా ఇతర వాణిజ్య నిర్మాణల నిమిత్తము మొదట వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేయిస్తూ తత్సంబంధిత రెవెన్యూ అధికారుల నుండి అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. ఇలాంటి వ్యవసాయేతర భూములుగా మార్పిడి అనుమతులు పొందినటువంటి భూములలో మాత్రమే హెచ్. ఎం. డి.ఎ.లేదాడి. టి. సి. పి. లాంటి సంస్థలు ఇళ్ల స్థలాల లేఔట్ ల కొరకు అనుమతులు ఇస్తాయి.మరియుఇలాంటి వ్యవసాయేతర భూములుగా మార్పిడి అనుమతులు పొందినటువంటి భూములలో మాత్రమే ఫాక్టరీలు లేదా ఇతర వాణిజ్య సంస్థల ఏర్పాటు కొరకు అనుమతులు ఇవ్వబడతాయి. కావున ఇలా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి అనుమతులు పొందినటువంటి భూములను కొనుటకు పెట్టుబడి పెట్టవచ్చు.

వ్యవసాయ భూముల నుండి వ్యవసాయేతర భూములుగా అనుమతులు పొందిన భూములను 'నాలా' భూములు అంటారు. 'నాలా' అనగా 'నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అస్సెస్మెంట్' అని అర్ధము. నాలా అనుమతులు పొందిన భూములలో పెట్టుబడులు పెట్టవచ్చు. కానీ ఇందులో కూడా కొన్ని తిరకాసులు ఉంటాయి. హెచ్. ఎం. డి.ఎ. లేదా డి. టి. సి. పి. లాంటి సంస్థలు ఇళ్ల స్థలాల లేఔట్ ల అనుమతులను పరిశీలించినట్లైతే అట్టి అనుమతుల షరతులు-నిబంధనలలో ఒక నిబంధన ప్రకారము ఇచ్చిన అనుమతిలో భూమి హక్కుదారుల పేర్లలో ఎలాంటి తేడాలున్ననూ సదరు హెచ్. ఎం. డి.ఎ./లేదా /డి. టి. సి. పి.సంస్థకు ఎలాంటి సంబంధము లేదు అని విశదీకరించి ఉంటుంది.కొన్ని సందర్భాలలో నాలా అనుమతులు పొందిన భూములలో కూడా ఇనామ్ భూములు, అసైన్ భూములు కూడా ఉండవచ్చు. ఇనామ్ భూములు గానీ అసైన్ భూములు గానీ కోనకూడని భూములు. కాబట్టి వ్యవసాయేతర భూములుగా అనుమతులు పొందిన భూముల విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుని పెట్టుబడులు పెట్టవలసి ఉంటుంది.

సదరు పెట్టుబడిదారునకు ఇక్కడ ఒక అనుమానము రావచ్చు. మరి ఒక స్థిరాస్తి కొనుగోలులో ఇన్ని జాగ్రత్తలు తీసుకోవాలసి ఉంటది అన్నప్పుడు ఒక సామాన్య పెట్టుబడిదారుణకు ఇంతటి పరిజ్ఞానము ఎలా ఉంటుంది అని. నిజమే, ఒక సామాన్య పెట్టుబడిదారునకు ఇంతటి పరిజ్ఞానము ఉండడము అసంభవము. కాబట్టే వివాదాలు, కోర్టు వ్యాజ్యాలు, పోలీసు కేసులు అనేవి జరిగేవి. చేతులు కాలాక ఆకులు పట్టుకునే అనే విధంగా కాకుండా ముందే తగిన జాగ్రత్తలు తీసుకుంటే పెట్టిన పెట్టుబడికి ఎలాంటి ధోకా ఉండదు. అంతా సవ్యంగా ఉంటుంది. కాబట్టి పెట్టుబడి పెట్టె ముందు తగిన అర్హతలు అనుభవము ఉన్న ఒక అడ్వకేట్ ద్వారా విచారణ జరిపించుకుని పెట్టుబడి పెట్టడము ఎంతో ఉత్తమం.



-అన్నం లిఖిత, లింగంపేట, భీమారం మండలం, జగిత్యాల జిల్లా

## లోకులు.. కాకులు

అనగనగా ఒక గ్రామం ఉండేది. ఆ గ్రామంలో ఇద్దరూ స్నేహితులు ఉండేవారు. వారిద్దరు ఒక రోజున ఓ పట్టణం నుంచి గాడిదను కొనుక్కొని తీసుకొని వస్తున్నారు. గాడిదతో నడుస్తూ ఉండగా, ఒక రైతు చూసి ఇదేంటి గాడిదను ఊరికే నడిపిస్తున్నారు అంటాడు. దీంతో ఒకరు గాడిదపై ఎక్కి కూర్చుంటారు. అలా కొద్ది దూరం వెళ్లాక దారిలో ఓ ప్రయాణికుడు.. ఇదెక్కడి న్యాయం? నీ స్నేహితుడిని నడిపిస్తావా? అంటాడు. అలా ఇద్దరు గాడిదపై ఎక్కి కూర్చొని వెళ్తుండగా ఒక పండితుడు చూసి.. ఆ గాడిదను అలా ఇబ్బంది పెడుతున్నారేంటని అడుగుతాడు. దీంతో ఆలోచనలో పడ్డ ఆ స్నేహితులు గాడిదపై నుంచి దిగుతారు. వాళ్లకు ఆ గాడిదను ఎలా తీసుకెళ్లాలో అర్థం కాక, తలపై ఎక్కించుకొని వెళ్తారు.

అది చూసి గ్రామ ప్రజలంతా నవ్వుతారు. ఆ గాడిదను దించి నడిపించుకుంటూ వెళ్తారు.


**నీతి: ఎలా ఉన్నా ఈ లోకం విమర్శిస్తుంది. సమాజానికి మనం ఎలా ఉన్న కష్టమే. వాళ్ల మాటలు పట్టించుకుంటే ముందుకు సాగలేం.**



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.